
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
బుధవారం 9 జూలై 2025





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు నసీర్, మాధవి, శ్రావణ్‌కుమార్, నరేంద్రకుమార్ ఎమ్మెల్సీలు చంద్రగిరి, మురుగుడు.

పేదరిక రహితమే లక్ష్యం

- సంక్షేమం అమల్లో బాలారిష్టాలు అధిగమిస్తాం
- డీఆర్‌సీ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని జిల్లాగా గుంటూరుని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాబోయే రోజుల్లో పీ-4ని పెద్దఎత్తున అమలు చేసి లక్షల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకు రాబోతున్నామన్నారు. కలెక్టరేట్‌లోని శంకరన్‌హాల్‌లో మంగళవారం జిల్లా సమీక్ష మండలి సమావేశం ఇన్ చార్జి మంత్రి అధ్యక్షతన జరిగింది. తొలుత గత సమావేశంలో సభ్యులు వేసిన ప్రశ్నలకు అధికారులు ఇచ్చిన సమాధానాలపై చర్చ జరిగింది. అనంతరం వ్యవసాయం, ఉద్యాన, జలవనరులు, పౌరసరఫరాలు, తల్లికి వందనం, స్వర్ణ ఆంధ్ర 2047 అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నంగా ఉన్నా సీఎం చంద్రబాబునాయుడు ఒక్కొక్క హామీని అమలు చేస్తూ వస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయనున్నామన్నారు. పేదరిక నిర్మూలన కోసం జిల్లా, నియోజక వర్గాల విజన్ యాక్షన్ ప్లాన్లు రూపొందించినట్లు తెలిపారు. అనుమతి తీసుకోకుండా సమావేశానికి గైర్హాజరైన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కి నోటీసు జారీ చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యే పలు సమస్యలను ప్రస్తావించారు.

- పీఎం కిసాన్ పథకానికి గత ఐదేళ్లతో పోల్చితే ఈ ఏడాది దాదాపుగా 40 వేల మంది లబ్ధిదారులు ఎందుకు అనర్హులయ్యారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రశ్నించారు. ప్రతీ దానికి ఆవు కథలా సమాధానం చెప్పొద్దని (మిగతా 8వ పేజీలో)

- ఆటోనగర్‌లో తాగునీటి వసతి లేదని, రూ.18 వేలను రూ.5 వేలకు తగ్గిస్తే అందరూ కుళాయి కనెక్షన్లు తీసుకొంటారని తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ తెలిపారు. కాకుమాను వారితోటలోని కార్మిక శాఖ స్థలం వద్ద వాకింగ్ ట్రాక్‌ని నిర్మించాలన్నారు. బీఆర్ స్టేడియంలో వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేపట్టాలన్నారు. రైల్వేస్టేషన్, ఆటోనగర్ వద్ద అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్నారు.
- ఏడు వేలమందికి పైగా కౌలు రైతులకు కార్డులు ఇస్తే బ్యాంకర్లు కేవలం 78 మందికి రుణాలు ఇవ్వడం ఏమిటని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రశ్నించారు. సాంఘిక సంక్షేమ శాఖ పథకాల విషయంలోనూ బ్యాంకర్లు అశ్రద్ధ వహిస్తున్నాయన్నారు. ఫిరంగిపురం చర్చిని టూరిజం సర్క్యూట్‌లోకి తీసుకొస్తే పర్యాటకం అభివృద్ధి చెందుతుందన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్, వేదికపై జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు



మరో ఐదు అన్న క్యాంటీన్లు!

- ఒక్కోటి రూ.61 లక్షలతో నిర్మాణం
- రూ.3.05 కోట్లు నిధుల విడుదల
- అక్టోబరు 2న ప్రారంభించడమే లక్ష్యం

(తాడికొండ, ఆంధ్రజ్యోతి)

అన్న క్యాంటీన్‌లు పేదల కడుపు నింపుతున్నాయి. పట్టణాలకే పరిమితమైన క్యాంటీన్‌లను మండల కేంద్రాలకు ప్రభుత్వం విస్తరిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మరో ఐదు క్యాంటీన్‌ల నిర్మాణం చేపడుతోంది. ఒక్కొక్క క్యాంటీన్ రూ.61 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. క్యాంటీన్ భవనాలు, ఫర్నీచర్ తదితర వసతులకు రూ.3.05 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయింది. అక్టోబరు 2న కొత్త క్యాంటీన్‌లు ప్రారంభించాలని ప్రభుత్వం సంకల్పించింది. పబ్లిక్ హెల్త్‌శాఖ పనులు నిర్వహిస్తోంది.

స్థల కేటాయింపు పూర్తి

పల్నాడు జిల్లాలోని అమరావతిలో, గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు, ఫిరంగిపురం, దుగ్గిరాల, బాపట్ల జిల్లాలోని బట్టిప్రోలులో కొత్తగా అన్న క్యాంటీన్‌ల నిర్మాణం చేపడుతున్నారు. ఒక్క ఫిరంగిపురం మినహా మిగతా నాలుగు చోట్ల స్థల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. స్థలాలను పబ్లిక్ హెల్త్ శాఖకు అప్పగించారు. పట్టణాల్లో ఈ శాఖ ఆధ్వర్యంలోనే క్యాంటీన్‌లను నిర్మించారు. మండల కేంద్రాల్లో కూడా అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తామని పేదలకు ఇచ్చిన ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. పట్టణాల తరహాలోనే ఈ ఐదు చోట్ల క్యాంటీన్‌లు ప్రారంభించి రుచికరమైన భోజనం, అల్పాహారం రూ.5 కే పేదలకు అందిస్తారు. రోజుకు రూ.15 చెల్లిస్తే.. మరో 2,500 మంది పేదలకు ఆహారం అందించేందుకు ప్రభుత్వ చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది.

సొసైటీలకు.. త్రిసభ్య కమిటీలు

- ఒక్కో సొసైటీకి చైర్‌పర్సన్.. ఇద్దరు సభ్యులు
- ఎమ్మెల్యేలు పంపిన పేర్లను ఆమోదించిన ప్రభుత్వం
- మూడు జిల్లాల్లో 93 సొసైటీల్లో 279 మందికి పదవులు



- అన్నవరం సొసైటీ కార్యాలయం

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) పాలక వర్గాలుగా త్రిసభ్య కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కొన్ని నెలల తరబడి చేస్తున్న కసరత్తు ఎట్టకేలకు ఒక కొలిక్కివచ్చింది. గత నెలలో సొసైటీల నిర్వహణ బాధ్యతలను అధికారులకు ప్రభుత్వం అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పట్లో సహకార ఎన్నికలు లేవని రైతులు నిరాశ చెందారు. పైగా వైసీపీ హయాంలో ప్రవేశపెట్టిన త్రిసభ్య కమిటీలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో రైతు నేతల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఈ క్రమంలో సొసైటీల్లో అధికారుల పాలన ఈ నెల 30తో ముగియనున్నది. దీంతో త్రిసభ్య కమిటీల నియామకానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పైగా ఆయా కమిటీల్లో పలువురికి పదవులు దక్కడంతో నేతల్లో హర్షం వ్యక్తమవుతోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో తొలివిడతలో 93 సొసైటీలకు కమిటీలను నియమించింది.

ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

సొసైటీల వారీగా త్రిసభ్య కమిటీల కోసం ఎమ్మెల్యేలు పంపిన పేర్లకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. దీంతో ఈ నెల 30న త్రిసభ్య కమిటీలు సొసైటీల బాధ్యతలు స్వీకరించనున్నాయి. సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. ఆ పాలక వర్గాలనే 2019 వరకు పొడిగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సొసైటీలకు ఎన్నికలు నిర్వహిస్తారని రైతులు ఆశించారు. అయితే సభ్యుల గుర్తింపు ప్రక్రియలో జాప్యం జరుగుతుంది. దీంతో కొత్త ఓటర్ల జాబితాలు రూపొందించే వరకు త్రిసభ్య పాలనకు ప్రభుత్వం మొగ్గు చూపింది.

279 మందికి పదవులు..

ఒక్కో సొసైటీలో చైర్‌పర్సన్‌తో ఇద్దరు సభ్యులు ఉంటారు. ఈ ప్రకారం మూడు జిల్లాల పరిధిలో తొలివిడతలో 279 మంది కూటమి నేతలను పదవులు వరించాయి. పల్నాడు జిల్లాలో 36 సొసైటీలకు నామినేటెడ్ కమిటీలను ప్రభుత్వం నియమించింది. గుంటూరు జిల్లా పరిధిలో 7, బాపట్ల జిల్లా పరిధిలో 50 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించింది.

నాడు నిర్వీర్యం..

సహకార రంగాన్ని వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారు. సహకార సంఘాల్లో నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ కార్యకర్తలను సభ్యులుగా చేర్చారు. దీంతో సొసైటీలు రాజకీయ కేంద్రాలుగా మారిపోయాయి. సహకార రంగాన్ని ఆ పార్టీ నేతలు ఐదేళ్ల దోచేశారు. నాబార్డు ద్వారా వచ్చిన నిధుల్ని కూడా పంచుకుతిన్నారు. రూ.లక్షల్లో స్కాంలు జరిగినట్లు (మిగతా 8వ పేజీలో)

రూ.34.15 కోట్ల పనులకు ఆమోదం

- స్థాయి సంఘ సమావేశంలో మేయర్ కోవెలమూడి

గుంటూరు కార్పొరేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో వివిధ డివిజన్లలో అభివృద్ధి పనులను రూ.34.15 కోట్లతో నిర్వహించేందుకు స్థాయి సంఘం ఆమోదం తెలిపినట్లు మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. ఆయా డివిజన్ల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిపాదించిన 101 అంశాలకు సంబంధించిన పనులపై మేయర్ చాంబర్‌లో జరిగిన స్థాయి సంఘాల సమావేశంలో చర్చించి ఆమోదించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ నగరంలో పార్కులను, జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లను ఆధునిక హంగులతో అభివృద్ధి చేస్తామన్నారు. పచ్చదనాన్ని అభివృద్ధి చేసి గ్రీన్ గుంటూరుగా మార్చేందుకు మిషన్ గ్రీన్ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగా నగరంలోని ప్రతీ ఇంటికి మొక్కలను పంపిణీ చేసి, వాటిని నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రాధాన్య క్రమంలో సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపడతామన్నారు. సమావేశంలో స్థాయి సంఘ సభ్యులు ఈరంటి వరప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, షేక్ మీరావలి, కమిషనర్ పులి శ్రీనివాసులతో పాటు విభాగాధిపతులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ రవీంద్ర

అన్నదాత సుఖీభవకు అర్హులేనా?

అన్నదాత సుఖీభవ

- 10 లోగా పరిశీలించుకోవాలని రైతులకు సూచన

గుంటూరు సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధికి అర్హుల్లో కాదో అన్న విషయాన్ని రైతులు పరిశీలన చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10లోపు రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించి తమ పేరు జాబితాలో ఉందో లేదో పరిశీలన చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు తీసుకుని వెళ్తే గ్రామ వ్యవసాయ సహాయకులు వివరాలు అందజేస్తారని తెలిపారు. ఒక వేళ అనర్హుల జాబితాలో పేరు ఉంటే ఏ కారణంతో అక్కడ నమోదయ్యారో పరిశీలించి పరిష్కారం చెప్తారన్నారు. గతంలో ఆదాయపు పన్ను చెల్లించిన వారిని, ఈ-నామ్ భూములు గతంలో కొన్న వారిని ఇంకా ఇతర కారణాలతో అనర్హుల జాబితాలో చేర్చి ఉంటే వాటికి తగిన పరిష్కారం చూపించే అవకాశం అందుబాటులో ఉందన్నారు.

ఈ-పంటలో నమోదు చేయించుకోవాలి

రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ-పంటలో నమోదు చేయించుకుంటేనే రైతులకు విత్తనాలు, ఎరువులు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల అమ్మకం వంటి ప్రయోజనం చేకూరుతుందన్నారు.

గ్రామాలు నందనవనాలు కావాలి

- తాళ్లూరులో మొక్కలు నాటిన డ్వామా పీడీ


ఫిరంగిపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ సీమలను నందన వనాలుగా రూపొందించాలని డ్వామా పీడీ శంకర్ తెలిపారు. మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద ఓ రైతు పొలంలో మంగళవారం మామిడి మొక్కలను పీడీ నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగు ఎంతో లాభదాయకమని, వంద శాతం పెట్టుబడి ఇస్తున్నామని తెలిపారు. రైతులు రాయితీల కోసం సచివాలయాల్లో, ఉపాధి హామీ పథకం సిబ్బందిని సంప్రదించాలని కోరారు. మొక్కలు నాటిన రోజు నుంచి రాయితీ లెక్కలోకి తీసుకుంటామన్నారు. తోటల పెంపకానికి ముందుకు వచ్చే రైతులకు ఎరువులు, పురుగు మందులు, సాగు నీరు పర్యవేక్షణ ఖర్చులను ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివ సుబ్రహ్మణ్యం, ఏపీవో కిరణ్మయి, టీఏ జయకృష్ణ, టీడీపీ నేత దేగల సీతారామయ్య, నీటి సంఘం అధ్యక్షుడు అంచుల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



తాళ్లూరులో మొక్కలు నాటుతున్న డ్వామా పీడీ శంకర్

కత్తితో పొడిచి.. రాయితో కొట్టి హతం

- తురకపాలెం రోడ్డులో ఓ వ్యక్తి దారుణ హత్య
- మూడు రోజుల అనంతరం మృతదేహం లభ్యం
- వివాహేతర సంబంధమే కారణమని పోలీసుల అనుమానం



కరిముల్లా (ఫైల్)

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్యామలానగర్ శివారు తురకపాలెం రోడ్డులో షేక్ కరిముల్లా(32) హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. గతంలో వాటర్ ప్లాంట్‌లో పని చేసే స్తంభాలగరువులోని రాజ్యలక్ష్మీనగర్ రెండోలేన్‌కి చెందిన కరిముల్లా మూడు నెలలుగా పనికి వెళ్లకుండా మద్యం తాగుతూ జులాయిగా తిరుగుతున్నాడు. స్తంభాలగరువు మూడో లేన్ రైలు కట్ట రోడ్డుకు చెందిన ఆటోడ్రైవర్ లావునూరి మధుసూదన్‌రెడ్డి, ఫైనాన్స్ వ్యాపారం చేసే శ్యామలానగర్ మూడోలేనుకు చెందిన వాగంటి శివరామరాజు ఇద్దరూ స్నేహితులు. ఇలా ఉంటే ఆదివారం సాయంత్రం కరిముల్లాను మధుసూదన్‌రెడ్డి శివరామరాజు ఆటోలో ఎక్కించుకుని తురకపాలేనికి తీసుకెళ్లాడు. అక్కడ జనసైతన్య ప్లాట్లలో ముగ్గురు మద్యం తాగారు. కరిముల్లాను మధుసూదన్‌రెడ్డి, శివరామరాజు కత్తితో పొడిచి, రాయితో కొట్టి హతమార్చారు. మృతదేహాన్ని ముళ్లపొదల్లో పడేసి వెళ్లారు. ఆదివారం నుంచి కరిముల్లా కనిపించకపోవడంతో సోమవారం కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కరిముల్లాను చంపి తురకపాలెం రోడ్డులోని పొదల్లో మృతదేహాన్ని పడేసినట్లు మధుసూదన్‌రెడ్డి మద్యం మత్తులో అన్న విషయం కరిముల్లా కుటుంబసభ్యులకు తెలిసింది. వారు ఆ ప్రాంతంలో గాలించినా మృతదేహం కనిపించలేదు. దీంతో మంగళవారం వారు పోలీసులను ఆశ్రయించారు. గేదెల కాపరులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు వెళ్లి చూడగా కరీముల్లా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి కనిపించింది. కరీముల్లా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులో అనుమానితులైన మధుసూదన్‌రెడ్డి, శివరామరాజులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. కరిముల్లా భార్య మూగ కావడంతో ఎనిమిదేళ్లుగా వదిలేశాడు. కరిముల్లా వదినతో శివరామరాజుకు సంబంధం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో కరిముల్లాకు శివరామరాజుకు మధ్య గొడవలు జరుగుతున్నదని, దీంతోనే హత్య జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కరీముల్లాను చంపితే డబ్బులు ఇస్తానని మధుసూదన్‌రెడ్డికి శివరామరాజు ఆశ చూపినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలోనే పథకం ప్రకారం మధుసూదన్‌రెడ్డి ఆటోలో తీసుకెళ్లి చంపినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అయితే కరీముల్లా హత్యతో తనకు ఎటు వంటి సంబంధం లేదని శివరామరాజు వాదిస్తున్నట్లు తెలిసింది.

ఏడు రోజుల్లోగా ఖాళీ చేయండి

- కొల్లి శారదా మార్కెట్ దుకాణదారులకు నోటీసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏడు రోజుల్లోగా ఖాళీ చేయాలని కొల్లి శారదా హోల్‌సేల్ మార్కెట్‌లోని దుకాణదారులకు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు నోటీసులు జారీ చేశారు. మార్కెట్‌లోని 85 దుకాణాలకు 25 సంవత్సరాల అద్దె కాల పరిమితి గతంలో ముగిసింది. దీంతో తిరిగి తమకే దుకాణాలు కేటాయించాలని లీజుదారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో కొన్నేళ్లుగా లీజుదారులకు, నగర పాలక సంస్థకు మధ్య వివాదం నడిచింది. స్పీకింగ్ నోటీసులు జారీ చేసి దుకాణాలను స్వాధీనపరుచుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో రంగంలో దిగిన నగర పాలక సంస్థ అధికారులు లీజుదారులకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఏడు రోజుల్లోగా దుకాణాలను ఖాళీ చేయాలని ఆయా నోటీసుల్లో పేర్కొన్నారు.



శ్రీశైలం బ్యారేజి నుంచి విడుదలవుతున్న నీరు

కృష్ణమ్మ పరుగులు

శ్రీశైలం నుంచి లక్షన్నర క్యూసెక్కుల నీరు విడుదల

- సాగర్ జలాశయానికి భారీగా వరద
- గణనీయంగా పెరగనున్న నీటి మట్టం
- ఖరీఫ్ పంటల సాగుకు అనుకూలం

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

కృష్ణానది పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో జలాశయాలకు వరద పోటెత్తుతోంది. శ్రీశైలం జలాశయం నిండు కుండలా మారింది. ప్రాజెక్ట్ నాలుగు గేట్లు తెరచి నాగార్జున సాగర్ జలాశయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం నీటిని విడుదల చేశారు. విద్యుదుత్పత్తి గేట్లు తెరచి దాదాపు లక్షన్నర కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలశయానికి కూడా భారీగా వరద వస్తోంది. దీంతో గణనీయంగా సాగర్‌లో కూడా నీటి నిల్వలు పెరగనున్నాయి. వారం రోజుల్లో 125 టీఎంసీల వరకు నీరు వస్తుందని జలవన రుల శాఖ అంచనా వేస్తోంది.

ఆయకట్టు రైతుల్లో ఆనందం

సాగర్‌కు కృష్ణమ్మ సవ్వడితో అన్నదాల్లో ఆనందం నెలకొంది. వరదనీరు పోటె త్తుండటంతో కుడి కాలువ ఆయకట్టు సాగుకు అనుకూల పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రస్తుతం వరి సాగుకు రైతులు సిద్ధమవుతు న్నా రు. శ్రీశైలం జలాశయంలోకి 1,73,351 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలంలో 215.81 టీఎంసీ లకుగాను నీటి నిల్వ 195.39 టీఎంసీలకు చేరింది.

శ్రీశైలం జలాశయా నికి ఇదే స్థాయిలో వరద మూడు రోజులు కొనసాగు తుందని జల వనరుల శాఖ అంచనా వేస్తోంది. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశ యాల నుంచి భారీగా వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌లో కూడా నీటి నిల్వ ఆశాజనకంగా ఉంది. సాగర్‌లో గతవారం రోజుల్లో 31 టీఎంసీల నీటి నిల్వ పెరిగిం ది. సాగర్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా మంగళవారం సాయంత్రానికి 169 టీఎంసీలకు చేరింది.

ఆల్ ఇన్ వన్.. రైల్‌వన్!
- రైల్వే సేవలన్నీ రైల్‌వన్ యాప్‌లోకి..
- రిజర్వుడ్, అన్‌రిజర్వుడ్, ప్లాట్‌ఫాం టిక్కెట్ బుకింగ్ సదుపాయం
- పీఎన్ఆర్ స్థితి, కోచ్ పొజిషన్ వంటి సర్వీసులెన్నో..
- ఫుడ్ కూడా ఆర్డర్ చేసే అవకాశం

ఇక సూపర్ ఫాస్ట్‌గా శబరి
- రైల్వేబోర్డు ఆమోదం, మారనున్న కాలమానం
- కొద్ది రోజుల్లోనే అమలులోకి

తెలుగు భాషను సుసంపన్నం చేసే సంస్కృతి రావాలి
ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్

సమస్యకు.. స్కాన్
- రేషన్ ఫిర్యాదులకు క్యూ ఆర్ కోడ్
- దుకాణాల వద్ద పోస్టర్లు ఏర్పాటు
8

విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్యే రోశయ్య
- భూ ఆక్రమణల ఆరోపణపై కమిషనర్ విచారణ
- ధ్రువ పత్రాలతో వచ్చిన బాధితురాలు భారతి
6

సీఆర్డీఏ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

తుళ్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిలో ఏపీ సీఆర్డీఏ సౌజన్యంతో బసవతారకం ఇండో అమెరికన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం , ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాలు జరగనున్నాయన్నాయి. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తుళ్లూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెసీ)లో.. ఈ నెల 11న ఉదయం యర్రబాలెంలోని అర్బన్ హెల్త్ సెంటర్(యుహెచ్‌సీ)లో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటలో పేర్కొంది. రాజధాని అమరావతి పరిసర ప్రాంతాల ప్రజలు వైద్య సేవలు వినియోగించుకోవాలని తెలిపింది. పూర్తి వివరాలకు సీఆర్డీఏ పెసి లిటేటర్ లేదా 79819 25147 నంబరుకు సంప్రదించవచ్చని పేర్కొంది.

నేటి నుంచి డైట్ సెట్.. వెబ్ కౌన్సెలింగ్

గుంటూరు(విద్య),జూలై 8(ఆంధ్రజ్యోతి): డైట్ సెట్ అర్హత సాధించిన అభ్యర్థులు బుధవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు జరగనున్న వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని డీఈఓ సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 నుంచి 16వ తేదీ వరకు సీట్ల కేటాయింపు, 17 నుంచి 22వ తేదీ వరకు డైట్ కళాశాలల్లో సర్టిఫికెట్ల పరిశీలన, 25 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు.

మైనార్టీ జూనియర్ కళాశాలలో.. ప్రవేశాలకు ఆహ్వానం

గుంటూరు (విద్య) జూలై 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని నందివెలుగు రోడ్డులో ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బైపీసీలో 20, సీఈసీలో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సొసైటీలకు.. త్రిసభ్య కమిటీలు

(5వ పేజీ తరువాయి)

విచారణల్లో వెలుగుచూస్తున్నాయి. చాలా సంఘాలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఎరువులు అమ్మకాలను నీరుగార్చి రైతు భరోసా కేంద్రాలకు అప్పగించారు. ఇంధన బంకులు, జన ఔషధి కేంద్రాలు ఇలా అన్నింటిలోనూ వైసీపీ వారికే ప్రాధాన్యం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాల ఫలితంగా సహకార వ్యవస్థ ఆర్థికంగా కుదేలైంది. ఇదే పాలనను కూటమి ప్రభుత్వం కూడా అమల్లోకి తీసుకురావడంతో పరిస్థితులు ఎలా ఉంటాయో చూడాలి.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

» ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల నిరసన

గుంటూరు (తూర్పు), జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు వర్తింపు చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గంగధారరావు మంగళవారం డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసనల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులకు రేషన్ కార్డు, పింఛన్ అమలు చేయాలని కోరారు. ఆరోగ్య శ్రీ కింద వైద్య సేవలు కల్పించాలని గత, ప్రస్తుత ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. దండా లక్ష్మీనారాయణ, నికల్సన్, శేషగిరిరావు, నాగేశ్వరరావు, నాంచారయ్య, వెంకటేశ్వరరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

మహిళా పోలీసుల..
బదిలీలు లోపభూయిష్టం

»ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు మహిళా సంరక్షణా కార్యద ర్శుల (పోలీసు) బది లీలు లోపభూయిష్టంగా జరి గాయంటూ వారు నిరసన వ్యక్తం చేశారు. అర్బన్‌లో విధులు నిర్వహిస్తున్న వారి ని పల్నాడులోని మారు మూల ప్రాంతాలకు బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళ వారం అధిక సంఖ్యలో మహిళా పోలీసులు జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అర్బన్‌లో పనిచేస్తున్న వారిని అర్బన్‌కే కేటాయించాలని కోరారు. ఇప్పటికే పిల్లలను స్కూలు, కాలేజీల్లో చేర్పుకున్నామని. ఇప్పటికిప్పుడు అంత దూరం వెళ్లాలంటే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మరికొందరు చంటి పిల్లలతో ఉన్నారని తెలిపారు. బదిలీలకు ముందే తమ నుంచి ఆప్షన్స్ తీసుకున్నారని, కానీ వాటి ప్రకారం బదిలీలు చేయలేదని మహిళా పోలీసులు వాపోయారు. ఏ ప్రాతిపదికన బదిలీలు నిర్వహించారో కూడా అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా బదిలీలకు సంబంధించి విధి విధానాలు కూడా రూపొందించలేదని మండిపడ్డారు. ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి తాము కోరుకున్న ప్రకారం బదిలీల ప్రక్రియ చేపట్టాలని కోరారు. సుమారు రెండు గంటలపాటు వారు జిల్లా పోలీస్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. అయితే జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అందుబాటులో లేకపోవడంతో.. అదనపు ఎస్పీని కలిసేందుకు ప్రయత్నించినా కుదరలేదు. దీంతో బుధవారం మరోసారి పోలీస్ కార్యాలయం ఉన్నతాధికారులను కలవాలని నిర్ణయించుకున్నారు.

విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్యే రోశయ్య

» భూ ఆక్రమణల ఆరోపణపై కమిషనర్ విచారణ » ధ్రువపత్రాలతో వచ్చిన బాధితురాలు భారతి



విచారణకు హాజరైన రోశయ్య, కమిషనర్ చాంబర్ ఎదుట ప్రజా సంఘాల ఆందోళన

గుంటూరు కార్పొరేషన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తనపై వచ్చిన భూ ఆక్రమణల ఆరోపణలపై గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఎదుట మంగళవారం హాజరయ్యారు. ఆయనతో పాటు ఫిర్యాదుదారురాలు, విశ్రాంత డిప్యూటీ తహసీల్దారు రాజారావు భార్య గుమ్మడి భారతి కూడా విచారణకు వచ్చారు. గుంటూరు నగరానికి చెందిన గుమ్మడి భారతి మాజీ ఎమ్మెల్యే రోశయ్యపై భూ ఆక్రమణ ఆరోపణలు చేశారు. నగరంలోని చుట్టుగుంట సెంటర్ నుంచి మిర్చి యార్డుకు వెళ్లే దారిలో సర్వే నంబర్ 178సీ/ ఏ బీ1లో ఎకరా 23 సెంట్లు భూమిని రాజారావు వద్ద అప్పటి డ్రైవర్‌గా పనిచేస్తున్న కావూరి రాఘవయ్య చౌదరి, నక్కర్తి పద్మ అనే వారితో కలిసి చల్లా వెంకటరమణతో 1980లో స్వాధీనపు అగ్రిమెంటు చేసుకున్నారు. అప్పట్లోనే పూర్తి నగదు చెల్లించి, ఆ పొలాన్ని స్వాధీనపరచుకొని వాణిజ్య పంటలు పండించారు. భూమిని రిజిస్ట్రేషన్ చేయమని రాజారావు, రాఘవయ్య చౌదరి, పద్మ వెంకటరమణను పలుమార్లు అడిగినా.. దాట వేసుకుంటూ వచ్చారు. 1981లో దాచేపల్లి రామారావు అనే అతను కోర్టులో ఈ భూమిపై డిక్రీ పొందాడు. అయితే రామారావుకి వచ్చిన తీర్పుపై అప్పటికే అగ్రిమెంట్ రాయించుకొని ఉన్న పైముగ్గురు కోర్టును ఆశ్రయించగా 1999లో వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ ఆస్తిని విక్రయించే హక్కు వెంకటరమణకు లేదని, అగ్రిమెంట్ రాయించుకొని ఉన్న పైముగ్గురికి చెందుతుందని కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే 1991లో వెంకటరమణ సురేంద్ర కుమార్ వగైరాలకు జీపీఏ చేశాడు. తద్వారా 2002లో మాజీ ఎమ్మెల్యే రోశయ్య తన బినామీలైన జక్కా శ్రీకాంత్, కిలారి రామబ్రహ్మం, శ్రీనివాసరావు వగైరాల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. కోర్టులో దావాలు పెండింగ్‌లో ఉండగా, ఆస్తి అమ్మే హక్కు వెంకటరమణకు లేదని కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ.. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. 2015లో హైకోర్టు బాధితురాలు భారతికి అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. 2021లో కేకేఆర్ సినిమా హాలు నిర్మించాలని, దాని వెనుక ఉన్న స్థలాన్ని ఆక్రమించేందుకు మాజీ ఎమ్మెల్యే రోశయ్య ప్రయత్నించారని ఆమె ఆరోపించారు. తన స్థలంలో దౌర్జన్యంగా ప్రహరీ నిర్మాణం చేపట్టారని, ఈ విషయం తెలిసి మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులకు తెలిజేశామని బాధితురాలు వెల్లడించారు. దీనిపై ఇరు వర్గాలకు నోటీసులు ఇచ్చి, వారి వాదనలను కమిషనర్ విన్నారు. రెండు గంటలపాటు విచారణ కొనసాగింది. ఈ విషయాన్ని కోర్టుల తేల్చుకోవాలని కమిషనర్ చెప్పారని బాధతురాలు గుమ్మడి భారతి పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడేందుకు రోశయ్య సుముఖత వ్యక్తం చేయలేదు. విచారణ అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కార్పొరేషన్‌లో ప్రజా సంఘాల ఆందోళన

బాధితురాలు భారతికి ప్రజా సంఘాల నాయకులు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే రోశయ్య కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే ఆయనను జనసేన పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మన్నవను ఫ్యాక్షన్ గ్రామంగా మార్చింది..
నాగమల్లేశ్వరరావు కుటుంబమే

» మాల కార్పొరేషన్ డైరెక్టర్ బాబూరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు, ఎస్సీ నేతలు

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మన్నవను ఫ్యాక్షన్ గ్రామంగా మార్చింది నాగమల్లేశ్వరరావు కుటుంబమేనని పొన్నూరు నియోజకవర్గ ఎస్సీ నేత, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు విమర్శించారు. గుంటూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1994లో మొదటిసారి సర్పంచ్‌గా వ్యవహరించిన బొనిగల నాగమల్లేశ్వరరావు హత్యా రాజకీయాలకు పాల్పడుతూ మల్లెల నాగమల్లి హత్యకు కారకులయ్యారని ఆరోపించారు. అలాగే 2000 నుంచి 2006 సంవత్సరం వరకు బొనిగల నాగమల్లేశ్వరరావు తల్లి సూర్య బాపమ్మ సర్పంచ్‌గా ఉండగా రేషన్ డీలర్ దగ్గర 200 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా అమ్ముకొని.. ఆ నేరాన్ని డీలర్ పైకి నెట్టి జైలుపాలు చేశారని పేర్కొన్నారు. కమ్యూనిటీ హాలు సొంత భవనంగా గ్రామ పంచాయతీ రికార్డు టాంపరింగ్ చేయగా వారిమీద 420 కేసు నమోదయిందని తెలిపారు. నాగమల్లేశ్వరరావు గ్రామ పంచాయతీ నిధులు దిగమింగడంతో అతనిపై 420 కేసు నమోదు చేసి, చెక్ పవర్ రద్దు చేసి సర్పంచ్‌గా కూడా తొలగించారని వివరించారు. నాగమల్లేశ్వరరావు ఈ మడేళ్లలో రూ. 55.6 లక్షల అవినీతికి పాల్పడి ప్రభుత్వ నిధులు దిగమింగారని.. దీనిపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తే.. అతడు సచ్ఛీలుడని వైసీపీ అగ్ర నాయకులు ఏవిధంగా సమర్థిస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో తనపై 30 మందితో దాడి చేసి, చనిపోయాననుకుని వదిలి వెళ్లిపోయారని బండ్లమూడి బాబూరావు గుర్తుచేశారు. మొదటి నుంచి బొనిగల నాగమల్లేశ్వరరావు అవినీతిని ప్రశ్నిస్తున్న తన కుటుంబంపై కక్షగట్టి అందరినీ అంతమొందించాలనే ఉద్దేశంతో గడిచిన ఐదేళ్లలో అనేకసార్లు తనపై దాడి చేశారని, 9 అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. నాగమల్లేశ్వరరావు ఒక అంతర రాష్ట్ర దొంగల ముఠా చరిత్ర కలిగినవాడని.. అంబటి మురళి, అంబటి రాంబాబు, పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు.

జవాన్‌కు ఘన నివాళులు

» నాగేశ్వరరావుకు కన్నీటి వీడ్కోలు పలికిన గ్రామస్థులు
» ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

పెదనందిపాడు, జూలై, 8(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జవాన్ నాగేశ్వరరావు మృతదేహానికి గ్రామస్థులు, బంధు మిత్రులు, పోలీసు అధికారులు మంగళవారం కన్నీటి వీడ్కోలు పలికారు. మండల పరిధిలోని వరగానిలో నాగేశ్వరరావు మృతదేహానికి రాజస్థాన్‌లోని బీకనీర్ 177వ మీడియం రెజిమెంట్ సుబేదారులు బీవీ రమణ, రవీంద్రలు పార్థివ దేహంపై జాతీయ జెండా ఉంచి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాద సమయంలో అక్కడి వైద్య సిబ్బందితో పాటు ప్రజలు కూడా సహకరించకపోవడం వల్లే తన భర్త, కుమారుడుని కోల్పోయానని నాగేశ్వరరావు భార్య బోరున విలపిస్తూ.. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి తగు న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. తహసీల్దార్ హెనప్రియ, ఎస్ఐ మధు పవన్‌కు.. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నాగేశ్వరరావుతో పాటు కుమారుడు వెంకట్ అభిషేక్ మృతదేహాలకు వరగానిలో శ్మశాన వాటికలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు.. ఏఆర్ ఎస్ఐ ఏసురాజు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో జనసేప జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు, ప్రత్తిపాడు సీఐ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పేదరిక రహితమే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

జిల్లా వ్యవసాయాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌస్‌హోల్డ్ సర్వేలో ఎడిట్ ఆప్షన్ లేకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. మార్గదర్శకాలు ఎక్కువమందికి లబ్ధి జరిగేలా ఉండాలే తప్ప, ఎక్కువ మంది అనర్హులయ్యేలా ఉండరాదన్నారు. ఒంటరి మహిళల పింఛన్‌కు విడాకుల సర్టిఫికెట్ విషయంలో సవరణ చేసి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ఎలాంటి సౌకర్యాలు లేకుండా కొనసాగుతున్న కృష్ణనగర్‌లోని రైతుబజార్‌కు శాశ్వత భవనం మంజూరైనా నిర్మాణం జరగడం లేదని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. నగరంలో ఎక్కడపడితే అక్కడ మిర్చి తొడాలను వేస్తుండటంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, చంద్రగిరి ఏసురత్నం, నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, జేసీ అమిలినేని భార్గవతేజ, డీఆర్వో ఖాజావలి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనసింహా, సీపీవో శేషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

»456 గ్రాముల గంజాయి, ఆటో, మూడు సెల్‌ఫోన్లు సీజ్

గుంటూరు కార్పొరేషన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): గం జాయి విక్రయిస్తున్న ము గ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ టూ టౌన్ సీఐ యశోదర దేవి మంగళ వారం తెలిపారు. నగరం లోని గుంటూరు వారి తోటకు చెందిన జాఫర్ అహ్మద్, డొంక రోడ్డు కాకుమాను వారి తోటకు చెందిన పెట్లూరి సాహిల్, బొంగరాల బీడుకి చెందిన దాసరి సుమంత్ అక్రమంగా గంజాయి విక్రయిస్తూ, సేవిస్తూ ఉంటారని తెలిపారు. గత రాత్రి అడవి తక్కెలపాడులోని టిడ్కో ఇళ్ల వద్ద గంజాయి విక్రయిస్తుండగా.. ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అతను ఇచ్చిన సమా చారం మేరకు వసంత రాయపురంలో మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారి నుంచి 456 గ్రాముల గంజాయి, ఆటో, మూడు సెల్ ఫోన్లు సీజ్ చేసినట్లు సీఐ యశోదరా దేవి తెలిపారు. ఎస్ఐ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

నాదెండ్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామంలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి దేవాలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దేవాలయం గ్రిల్స్ తాళాలు పగల గొట్టి గర్భగుడిలో స్వామి వార్లకు అలంకరించిన మూడు వెండి కిరిటీలు, శంకు చక్రాలను, 24 గ్రాముల బంగారు వస్తువులను అపహరించుకు పోయారు. హుండీ పగల గొట్టి నగదు చోరీ చేశారు. వీటిన్నంటి విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందని అంచనా. సమాచారం మేరకు.. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ పుల్లారావు దేవాలయాన్ని సందర్శించి, వివరాలు సేకరించారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ వేలి ముద్రలను సేకరించింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	104, 112, 123
చికెన్ విత్ స్కిన్(కిలో)	200.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	210.00

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ


వృద్ధురాలికి కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

నిరుపేదల తలరాతలు మార్చే ప్రభుత్వం ఇది

● తూర్పు ఎమ్మెల్యే నసీర్
● ఆరో డివిజన్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇది మనసున్న ప్రభుత్వమని, నిరుపేదల తలరాతలు మార్చే ప్రభుత్వమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన నియోజకవర్గంలోని ఆరో డివిజన్ రైలుపేటలో పర్యటించారు. సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను స్థానికులకు అందజేసి ఏడాది కాలంలో ప్రభుత్వం సాధించిన విజయాల గురించి వివరించారు. ప్రతి పథకం తమ జీవితాలను మార్చే వెలుగు రేఖ అని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైలుపేట ప్రాంతంలో అడుగుపెట్టాలంటే దుర్భరంగా ఉండేదని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పరిస్థితులను పూర్తిగా మార్చేశామని తెలిపారు. గుంతల రోడ్లకు మహర్దశ తీసుకొచ్చామని, వీధి లైట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. తాగునీటి సరఫరా విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజల దాహార్తిని తీరుస్తున్నామన్నారు. ఇవే కాకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం తల్లికి వందనం, పింఛన్ల పెంపు, కార్పొరేషన్ లోన్లు అందిస్తున్నామని తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో జాబ్ మేళా ద్వారా సుమారు వెయ్యి మంది నిరుద్యోగులకు బతుకు బాట చూపించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్ సమత, రాజా మాస్టర్, శ్రీను నాయక్, పూర్ణ సింగ్, పోతురాజు చంద్రశేఖర్, బాజీ మాస్టర్, మస్తాన్ రెడ్డి, కొనకళ్ల సత్యం, ఫిరోజ్, గంట కిరణ్, లోకేష్, కొత్తూరి వెంకట్, వలి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సచివాలయ మహిళా పోలీసు ఉద్యోగులు

బదిలీలలో తీవ్ర అన్యాయం

● కలెక్టరేట్ ఆవరణలో సచివాలయ మహిళా పోలీసుల నిరసన

గుంటూరు(తూర్పు), జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను పక్కన బెట్టి బదిలీలు జరుపుతున్నారని గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీలు పారదర్శకంగా జరగాలంటూ కలెక్టరేట్ లోపల రాత్రి సమయంలో ఉద్యోగులు బైఠాయించి నిరసన తెలిపారు. జీవోలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా బదిలీల ప్రక్రియ చేపట్టారని మండిపడ్డారు. వార్డు నుంచి ప్రతి వార్డుకు మాత్రమే బదిలీ జరగాలని ప్రభుత్వం జీవో జారీ చేసిందని, దానిని పక్కనబెట్టి బదిలీ ప్రక్రియ నిర్వహిస్తున్నారని వాపోయారు. దాదాపు వంద కిలోమీటర్ల వద్ద ఉన్న సచివాలయాలకు బదిలీ చేస్తున్నారని, తక్కువ జీతాలతో అంత దూరంలో విధులు ఎలా నిర్వహిస్తామని ప్రశ్నించారు. సచివాలయ పరిధిలో మిగిలిన శాఖలలో విధుల నిర్వహిస్తున్న సిబ్బందిని పక్క సచివాలయాలకు మాత్రమే బదిలీ చేస్తున్నారని, ఒక్క పోలీసులను మాత్రం దూర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని అన్నారు. కలెక్టర్ స్పందించి బదిలీలలో నిబంధనలను అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా సమీక్ష కమిటీ సమావేశానికి హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్‌కు, అడిషనల్ ఎస్పీ రమణమూర్తికి వినతి పత్రాలను అందజేశారు.

నేడు జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మె సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి బీఆర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటీకరణకు బానిసలుగా మారిన పాలకులను హెచ్చరించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ సమ్మె ఒక్కరోజు కార్యక్రమం కాదని, సమ్మె అనంతరం పోరాటాలు మరింత తీవ్రతరంగా కొనసాగుతాయని హెచ్చరించారు. సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, యువత, ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, షేక్ వలి, మంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, పాల్గొన్న సీపీఐ నాయకులు

సాయినాధునికి నాగవల్లీ దళార్చన

గుంటూరు(తూర్పు), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యానగర్, 3వ లైన్‌లోని శ్రీ సాయినాధ సన్నిధానంలో గురుపౌర్ణమి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బాబా వారికి విశేషాభి షేకాలు, అర్చనలు జరిగాయి. అనంతరం సాయినాధునికి భక్తి శ్రద్ధలతో నాగవల్లీ దళార్చన నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొని బాబా వారి పాద పద్మములను తమలపాకులతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలను సన్నిధానం గౌరవ అధ్యక్షుడు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య, స్వరూపరాణి తదితరులు పర్యవేక్షిస్తున్నారు.


సాయినాధునికి నాగవల్లీ దళార్చన సమర్పిస్తున్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా బుధవారం ఎల్‌బీసీ కాలనీ, భాగ్యనగర్, ఎస్‌పీఎస్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు డిప్యూటీ ఈఈ ఎస్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

దశల వారీగా వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర


ప్రసంగిస్తున్న నగర మేయర్ రవీంద్ర, వేదిక పైన ఎమ్మెల్యేలు నసీర్, మాధవి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలో దశల వారీగా వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని నగర ప్రజలు, వీధి వ్యాపారులు సహకరించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్, గళ్లా మాధవి, డిప్యూటీ మేయర్ షేక్ సజీలాతో కలిసి మిషన్ గ్రీన్, వెండింగ్ జోన్ల ఏర్పాటుపై కార్పొరేటర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో తొలుత మోడల్‌గా నగరపాలక సంస్థ కార్యాలయం పరిసరాల్లో ఉండే వీధి వ్యాపారులకు నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ వెండింగ్ జోన్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నగరపాలక సంస్థ స్థలాల్లో జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు ఈ నెల 10న విద్యా సంస్థల్లో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో ప్రతి విద్యార్థికి ఒక మొక్కను అందించాలన్నారు.

కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగర పరిధిలో అస్తవ్యస్తంగా ఉన్న వీధి వ్యాపారులను వారి హక్కులకు భంగం కలగకుండా, చట్ట ప్రకారం జోన్ల ఏర్పాటు ద్వారా క్రమబద్ధీకరించనున్నామన్నారు. అవసరమైతే ప్రైవేట్ స్థలాలు లీజ్‌కి తీసుకొని వార్డుల వారీగా అవసరమైన ప్రాంతాల్లో జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే నగర వెండింగ్ కమిటీ పలు ప్రాంతాలను గుర్తించిందని తెలిపారు. అలాగే నగరంలో ఈ సీజన్‌లో 5 లక్షల మొక్కలను దశల వారీగా నాటడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, అందులో ఇప్పటికే సుమారు 33 వేల మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నగరంలో తొలుత వీధి వ్యాపారుల వలన ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్న ప్రాంతాల్లో వారికి జోన్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఒక్కో వార్డులో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేకంగా సిబ్బందికి బాధ్యతలు కేటాయిస్తే మొక్కల రక్షణ జరుగుతుందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ వీధి వ్యాపారులకు ప్రస్తుతం వారు వ్యాపారాలు చేసుకుంటున్న ప్రాంతాల్లో జోన్లు ఏర్పాటు చేస్తే ఎక్కువ మంది అభ్యంతరాలు లేకుండా ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. నగరంలో ప్రధాన రోడ్ల వెంట మొక్కలు నాటడం, సంరక్షించడం జీఎంసీ తీసుకోవాలని, అంతర్గత రోడ్లు, పార్క్ లలో స్థానికంగా మొక్కల పెంపకంపై ఆసక్తి ఉన్న వారు ఉంటే వారికి అప్పగిస్తే బాగుంటుందన్నారు. అనంతరం మిషన్ గ్రీన్, వెండింగ్ జోన్ల ఏర్పాటుపై కార్పొరేటర్లు పలు సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏడీహెచ్ జె.శాంతి, ఎంహెచ్ఓ (ఇన్‌చార్జి) రామారావు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

మిషన్ ఫర్ ద యూత్ సేవలు అభినందనీయం

గుంటూరు(విద్య), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విద్యాభివృద్ధికి, యువత సామాజిక, సాంఘిక ఆర్థిక అభివృద్ధికి మిషన్ ఫర్ ద యూత్ ఎంతగానో కృషి చేయటం అభినందనీయమని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరహా కార్యక్రమాలలో ఉద్యోగస్తులు అందరూ కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విశ్రాంత పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ బుస్సా రత్న ప్రసాద్ మాట్లాడుతూ అన్ని వర్గాలలో ఉన్న పేద యువతను ఉద్యోగ, వ్యాపార రంగాలలో ప్రోత్సహించడానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగస్తులందరూ భాగస్వాములు కావాలని రత్న ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ రియాజ్ అహ్మద్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు జి.బ్రహ్మయ్య, కే శివకుమార్, జి అశోక్, జెడ్ రమేష్, కొరివి వినయ్ కుమార్, ఆలా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



లోగో ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తదితరులు

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా యడ్లపల్లి

గుంటూరు(లీగల్), జూలై 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది యడ్లపల్లి కోటేశ్వరరావును గుంటూరు నగరపాలక సంస్థకు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ కమిషనర్ పులి శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మంగళవారం కోటేశ్వరరావుకు అందజేశారు. నగరంలోని పలు కోర్టులలో నగరపాలక సంస్థ తరఫున కోటేశ్వరరావు మూడేళ్ల పాటు న్యాయవాదిగా హాజరై వాదనలు వినిపించనున్నారు. 1994 నుంచి కోటేశ్వరరావు గుంటూరు జిల్లా కోర్టుల్లో న్యాయవాదిగా పని చేస్తున్నారు. కోటేశ్వరరావు నియామకంపై పలువురు సీనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేస్తున్న శ్యామల సుధాకర్‌రెడ్డి నుంచి కోటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది.

ఈవ్‌టీజర్‌కు తల్లిదండ్రుల మందలింపు

● ఎన్జీవో కాలనీ ఎస్‌కేబీపీఎం వద్ద విద్యార్థినులపై వేధింపులు

గుంటూరు (విద్య) జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్జీవో కాలనీలోని ఎస్‌కేబీపీఎం స్కూల్లో విద్యార్థిని వేధిస్తున్న ఈవ్‌టీజర్‌ను తల్లిదండ్రులు మంగళవారం మందలించారు. స్థానిక నల్లకుంట పరిసర ప్రాంతాల్లో ఉంటున్న కొంతమంది ఆకతాయిలు పాఠశాలలో చదివే విద్యార్థినుల్ని నిత్యం వేధిస్తున్నారు. బైక్‌పై వెంబడిస్తూ అసభ్య పదజాలంతో టీజింగ్ చేస్తున్నారు. గత 15 రోజులుగా ఇబ్బందులు ఎక్కువ కావడంతో విద్యార్థినులు ఈ విషయం పాఠశాలలో ఉపాధ్యాయ దృష్టికి తీసుకువచ్చారు. మంగళవారం తల్లిదండ్రులను పిలిపించి ఉపాధ్యాయులు కాపు కాశారు. పాఠశాల నుంచి వెళ్తున్న విద్యార్థినుల్ని వేధిస్తున్న యువకుడిని పట్టుకొని మందలించారు. ఇందులో మొత్తం నలుగురు యువకులు ఉండగా ముగ్గురు తప్పించుకున్నారు.


యువకుడిని మందలిస్తున్న తల్లిదండ్రులు

విద్యుత్ పోల్ పడి ఇద్దరికి గాయాలు

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పోల్ పడి ద్విచక్రవాహన చోదకులు గాయపడిన సంఘటన మెడికల్ కళాశాల రోడ్డులోని రైల్వే క్వార్టర్స్ వద్ద జరిగింది. శ్రీనివాసరావుపేటకు చెందిన అబ్దుల్ బియాబాని, బాబు ఇద్దరూ జీజీహెచ్‌లో తమ బంధువును పరామర్శించేందుకు వెళుతున్నారు. మార్గమధ్యంలో రైల్వే క్వార్టర్స్ వద్దకు రాగానే విద్యుత్ పోల్ ఒక్కసారిగా విరిగి పడింది. ఇందులో బియాబాని చిన్నపాటి గాయాలతో బయటపడగా బాబు కాలుకు తీవ్ర గాయమైనట్లు తెలిపారు. బాబును ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోల్ విరిగి రోడ్డు పక్కన పడిపోవటం, అందులో విద్యుత్ సరఫరా లేకపోవటంతో ప్రాణనష్టం తప్పిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ యంత్రాంగం బలహీనంగా ఉన్న పోల్స్ స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని కోరారు.


గాయపడిన బాబు


రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభం


ట్యాబ్‌లు అందుకున్న ఆర్పీలతో బూర్ల రామాంజనేయులు

ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ

గుంటూరు(తూర్పు), జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్‌లో క్యాంపు కార్యాలయంలో ఆర్పీలకు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ట్యాబ్‌లతో సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు వేగవంతంగా ప్రజలకు అందుతాయని చెప్పారు. ప్రభుత్వ సర్వేలు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఈ ట్యాబ్‌లు ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, ఇమ్మడి మల్లేశ్వరరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం

గుంటూరు(విద్య), జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెల్లాకుల జాలయ్య, పోలిశెట్టి సోమసుందరం కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా బీపీహెచ్ కామేశ్వరశాస్త్రి నియమితులైన సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘం, ఏటీ అగ్రహారం కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి తమ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు అంబడి పూడి శ్యాంసుందర్, గౌరవాధ్యక్షుడు వంక మామిడి వెంకటరామయ్య, ఉపాధ్యక్షుడు జమ్మలమడుగు సీతారామాంజనేయ శర్మ, కార్యదర్శి పమిడిఘటం వెంకట సత్యనారాయణ, కోశాధికారి సునర్ల వెంకటరమణ పాల్గొన్నారు.


కామేశ్వరశాస్త్రిని సత్కరిస్తున్న బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు

వైఎస్ఆర్‌కు ఘన నివాళులు

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమం కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. వైసీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పఠాన్ సైదా ఖాన్ ఆధ్వర్యంలో పట్టాభిపురంలోని మాతృశ్రీ వృద్ధాశ్రమంలో వైఎస్ఆర్ జయంతి జరిగింది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంలు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమంలో అల్పాహారాన్ని పంపిణీ చేశారు. వైసీపీ సీనియర్ నాయకుడు మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డు సెంటర్‌లో వైఎస్ఆర్ జయంతి కార్యక్రమం జరిగింది. వైసీపీ తూర్పు ఇన్‌చార్జ్ షేక్ నూరిఫాతిమా హాజరై గజమాలతో నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే సంక్షేమ విప్లవాన్ని సృష్టించిన ఘనత వైఎస్ఆర్‌దే అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, జీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు పూనూరి నాగేశ్వరరావు, తుమ్మేటి శ్రీనివాసరావు తదితరులున్నారు.



వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కూచిపూడి విజయ తదితరులు

● రాజీవ్‌గాంధీభవన్‌లో వైఎస్ఆర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ కూచిపూడి విజయ, పార్టీ నాయకులు డాక్టర్ రాచకొండ జాన్‌బాబు, బిక్కా సునీల్‌లు పూలమాలలతో నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ వైఎస్ఆర్ కలలు కన్నట్లు రాహుల్‌గాంధీని ప్రధాని చేయటమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రత్తయ్య, మోషే, రామకృష్ణ, ఖలీల్, కరీమ్, కిరణ్ తదితరులున్నారు.

స్మార్ట్ టీవీ బహుకరించిన పూర్వ విద్యార్థులు

గుంటూరు (విద్య) జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టీజేపీఎస్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు కళాశాలకు స్మార్ట్ టీవీ బహుకరించారు. కళాశాలలో 1975-1978 విద్యాసంవత్సరంలో డిగ్రీ చదివిన విద్యార్థులు కె.నాగలక్ష్మి, యలమంచిలి మురళి, కిలారి కృష్ణారావు, విద్యాసాగర్‌రెడ్డి, మధుబాబు, లీలాకృష్ణ, మనోహర్, ప్రసాద్, ఖలీల్, జాకీమ్ మంగళవారం ప్రిన్సిపల్ కామేశ్వరశాస్త్రికి టీవీ అందజేశారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, మేయర్ రవీంద్ర తదితరులు

ఇళ్ల పట్టాల పేరుతో లబ్ధిదారులను మోసం చేసిన వైసీపీ

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి
● ఎమ్మెల్యే ఎదుట గోడు వెళ్లబోసుకున్న పలువురు బాధితులు

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గత ఎన్నికలకు ముందు జగనన్న కాలనీ పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లచెరువు 19వ డివిజన్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆమె, మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలను పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. గత ఎన్నికలకు ముందు వైసీపీ నేతలు తమకు జగనన్న కాలనీలో ప్లాట్లు ఇస్తున్నాం అని చెప్పి పత్రాలు అందజేశారు, కానీ స్థలం ఎక్కడ ఉన్నదో చూపించలేదని తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే గళ్లా మాధవిని కోరారు. అదేవిధంగా టిడ్కో ఇళ్ల కేటాయింపులో వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే మాధవికి ఫిర్యాదు చేశారు. నల్లచెరువు జీరో లైన్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే గళ్లా మాధవి విలేకరులతో మాట్లాడుతూ నల్లచెరువు, సంపత్‌నగర్, శ్రీనివాసరావుపేటకు చెందిన ప్రజలకు అనంతవరప్పాడు గ్రామంలో 1500 - 2000 ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నామని చెప్పి, అనేక మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఆన్‌లైన్‌లో ఎక్కించి, స్థలాలు ఎక్కడో చూపకుండా వైసీపీ నేతలు మోసం చేశారన్నారు. అదేవిధంగా టిడ్కో ఇళ్ల కేటాయింపులో భారీగా అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశారన్నారు. వీటన్నిటిని రాబోయే రెండు రోజుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఒక సమావేశం ఏర్పాటు చేసి విచారణ జరిపి లబ్ధిదారులకు న్యాయం చేకూరేలా, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశీలకుడు సింహాద్రి కనకాచారి, డివిజన్ అధ్యక్షుడు రాళ్లబండి రామరాజు, తేలుకుట్ల హనుమాయమ్మ, పరిమి రమేష్, మల్లేశ్వరరావు, అబ్దుల్ రహీం, చంద్రగిరి బాబు, సభాపతి విజయలక్ష్మి, పులి కృష్ణ, లేళ్ల వెంకటేశ్వర్లు, రాంబిల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కీచకుల పార్టీగా మారిన వైసీపీ

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి


కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ కీచకుల పార్టీగా మారిపోయిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌రెడ్డికి ఏ మాత్రం మహిళలపై గౌరవం ఉన్నా వెంటనే ప్రసన్నకుమార్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలను అవమానించిన ప్రతి ఒక్కరిని జగన్‌రెడ్డి అందలాలు ఎక్కించటమే ఇలాంటి సంఘటనలకు కారణమని గుర్తు చేశారు. అంబటి రాంబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, వంశీ, గోరంట్ల మాధవ్, అవంతి శ్రీనివాస్ లాంటి తదితర నీచులకు జగన్ రెడ్డి అండగా ఉండబట్టే మహిళలకు రక్షణ కరువైందని అన్నారు. భువనమ్మ శాపంతో, అమరావతి మహిళల ఆక్రోశంతో జగన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా దక్కక పోయినా వారిలో మార్పు రాకపోవటం సిగ్గు చేటన్నారు. మహిళా ఎమ్మెల్యే అన్న కనీస గౌరవం లేకుండా ఉచ్చనీచాలు మరిచి మాట్లాడిన ప్రసన్నకుమార్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని అన్నారు. ఆ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి సొంత చెల్లెలుపై వ్యక్తిత్వ హననానికి పాల్పడితే, వరసకు చెల్లెలైన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న దుర్మార్గంగా మాట్లాడటం హేయమన్నారు. మహిళలను వేధిస్తున్న వైసీపీ రాజకీయ పార్టీగా ఇక ఏ మాత్రం మనుగడ సాగించలేదని కనపర్తి తేల్చి చెప్పారు.

ప్రసన్నకుమార్‌రెడ్డి మహిళాలోకానికి వెంటనే క్షమాపణ చెప్పాలి

● లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మహిళా లోకానికి వెంటనే క్షమాపణ చెప్పాలని, క్షమాపణ చెప్పని పక్షంలో పోలీసులు అతడిని అరెస్టు చేయాలని లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు ప్రజల సమస్యల గురించి కానీ, పరిష్కార మార్గాల గురించి కానీ ఏనాడు మాట్లాడలేదన్నారు. ప్రత్యర్థి రాజకీయ పార్టీల నాయకులను శత్రువులుగా భావించి బూతు పురాణాలను మాట్లాడుతుంటారని విమర్శించారు. ప్రశాంతి రెడ్డిపై నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన దారుణమైన వ్యాఖ్యలను మరలా ప్రెస్‌మీట్ పెట్టి సమర్థించుకోవడం వైసీపీ బరితెగింపునకు నిదర్శనమన్నారు. జగన్ మార్క్ అరాచక రాజకీయాలను ప్రజలు గమనించి వైసీపీని రాజకీయంగా సమాధి చేశారన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నేతలు

ప్రసన్నకుమార్‌రెడ్డిపై జగన్ చర్యలు తీసుకోవాలి

● టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై జగన్ చర్యలు తీసుకోకపోవడం మహిళలను అవమానించడమేనని టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వైసీపీ దిగజారుడుతనానికి పరాకాష్ట అన్నారు. మహిళల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అశ్లీల పదజాలాన్ని ఖండించడానికి కూడా జగన్‌రెడ్డి ముందుకు రాకపోవడం మహిళలను అవమానించడమేనన్నారు. కన్న తల్లిని, సొంత చెల్లిని తరిమేసిన జగన్‌రెడ్డికి మహిళల త్యాగాలు, గొప్పతనం గురించి ఏం తెలుస్తుందని ప్రశ్నించారు. వైసీపీ నేత ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు జగన్‌రెడ్డి బేషరతుగా మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రత్తిగడుపు హనుమంతరాజు, దూదేకుల షాహిద్, దుడికి సాంబయ్య, వంగర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

గురువైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం

గుంటూరు(తూర్పు), జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం గురువైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిష్కల నరసింహమూర్తి గురుపౌర్ణమి ప్రాధాన్యతను వివరిస్తూ శంకరులను జగద్గురువులు అని ఎందుకు అంటారో వివరించారు. గురువు త్రిమూర్త్యాత్మకుడు అని అనడానికి కారణం, అష్టావక్రుడు, జనకునికి బ్రహ్మోపదేశం చేసిన తీరు వివరించారు.

నల్లపురెడ్డిపై ఫోక్సో కేసులు చాలవు: నన్నపనేని

తెనాలి అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్న వైసీపీ నేత నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై ఫోక్సో కేసులు చాలవని మహిళ కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి చెప్పారు. ఎంపీ వేమిరెడ్డిపై ఆయన చేసిన వ్యాఖ్యలను మంగళవారం విలేకరుల సమావేశంలో ఖండించారు. మహిళా లోకాన్ని అవమానపరిచేలా మాట్లాడిన ఆయనతీరు దారుణంగా ఉందన్నారు. వైసీపీ పాలనలోని అక్రమాలు, అన్యాయాలు, అరాచకాలపై ప్రజలు బుద్ధి చెప్పినా కూడా ఆ నేతల్లో మార్పు రాలేదన్నారు. నల్లపురెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

వైశ్య విద్యానిధి హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్‌స్టేషన్ వద్ద ఉన్న శ్రీకన్యకా పరమేశ్వరి వైశ్య విద్యానిధి హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కార్యదర్శి పెండేల వెంకట్రావు తెలిపారు. ఆర్యవైశ్య విద్యార్థులకు హాస్టల్‌లో ఉచిత వసతి, ఉచిత భోజన సదుపాయం ఉందని, ఇంటర్ నుంచి పీజీ వరకు, ఇంజనీరింగ్ చదువుకోవాలనే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హాస్టల్ ఆఫీసులో ఆసక్తి కలిగిన విద్యార్థులు సంప్రదించి దరఖాస్తులు పొందాలని కోరారు. 25గదులలో 100 మంది విద్యార్థుల వరకు వసతి కల్పిస్తామన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త వేధిస్తున్నాడంటూ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రామలింగేశ్వరపేటకు చెందిన షేక్ అక్మల్, షేక్ బషీరాలు గత సంవత్సరం సెప్టెంబరులో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అక్మల్ టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని రోజుల నుంచి భార్య భర్తల మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. దీనితో గర్భవతిగా ఉన్న బషీరాను భర్త మానసికంగా శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధితురాలు బషీరా మంగళవారం పోలీసులను ఆశ్రయించి భర్త అత్తమామలు వేధిస్తున్నారంటూ ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

13న మహిళలకు యోగ శిక్షణ శిబిరం

తెనాలి అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): శ్రీఆంజనేయ ధ్యాన మండలి ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేక యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని కిషోర్‌గురూజీ తెలిపారు. బోసురోడ్డులోని వాసవీ ఆలయ ప్రాంగణంలో ఈ నెల 13న శిబిరం ప్రారంభం అవుతుందన్నారు.

చెత్తరహిత పొన్నూరుకు చర్యలు: కమిషనర్

పొన్నూరు టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పొన్నూరును చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం పొన్నూరు పట్టణంలో పలు వార్డుల్లో పర్యటించిన కమిషనర్ అన్న క్యాంటీన్‌ను తనిఖీచేశారు. ఈ నందర్భంగా రహదారుల వెంట మురుగు కాలువల్లో చెత్త వేయరాదని ప్రజలకు సూచించారు. తడి పొడి చెత్తలను వేరుగా సేకరించి సిబ్బందికి అందించడం ద్వారా చెత్తను ప్రాసెస్ చేసి పొన్నూరు పట్టణాన్ని చెత్తరహితంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. అలాగే అన్న క్యాంటీన్‌ను తనిఖీచేసి ఆహారం స్వీకరించిన ప్రజల నుంచి సలహాలు సూచనలు అడిగి తెలుసుకున్నారు.

అంబటి మురళిపై చర్యలు తీసుకోవాలి: టీడీపీ

పొన్నూరు టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్న వైసీపీ నాయకుడు అంబటి మురళిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్ డిమాండ్ చేశారు. అర్బన్ పోలీసు స్టేషన్‌లో టీడీపీ నాయకులు మంగళవారం సీఐ వీరానాయక్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు అందించారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, ఆకుల సాంబశివరావు, బొర్రు రామారావు, ఫిరోజ్‌ఖాన్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ముగ్బుల్‌బేగ్, మాజీ కౌన్సిలర్‌లు ఎరసాని శ్రీరామమూర్తి, తోట ప్రసాద్, బాజీసాహెబ్, సి.సీతారామయ్య, ఆరె ప్రసాద్, బి.రవికిరణ్, కరిముల్లా బాజీ, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామ పురోగతికి సమగ్ర ప్రణాళిక: ఎంపీడీవో

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల పురోగతికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీవో టి.ఉషారాణి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల పురోగతిని అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌గా గుర్తించడం జరుగుతుందన్నారు. సూచిక తయారీపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏ శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ రవిశంకర్, పలు శాఖల అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వ సహకారం: ఏపీవో

పొన్నూరు టౌన్, జూలై, 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు అదనపు ఆదాయం కల్పించేందుకు పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం రాయితీలను అందిస్తుందని జాతీయ ఉపాధిహామీ పథకం ఏపీవో ఎం.సుబాషిణి అన్నారు. మండల పరిధిలోని ఆరెమండలో ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటల పెంపకంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు, సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు, డీసీ చైర్మన్ రామకృష్ణ, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

● బీపీటీ సాగుకు రైతుల ఆసక్తి



కొల్లిపరలో వెద పద్ధతి ద్వారా వరి సాగు చేస్తున్న రైతులు

కొల్లిపర, జూలై 8 (ఆంధ్రజ్యోతి): డెల్టాలో ఖరీఫ్ సాగు ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనులలో తలమునకలయ్యారు. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు పడటంతో భూములన్నీ సాగు చేయటానికి అనువుగా మారాయి. వారం పదిరోజుల నుంచి ఎండలు వేయడంతో డెల్టా ప్రాంతంలోని రైతులు ఖరీఫ్ పనులపై దృష్టి సారించారు. భూముల్లో ఉన్న మొక్కజొన్న దంటులను కూలీలతో తీసివేయించడంతో పాటు పంట కాల్వలను, గట్లులను పటిష్టం చేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా దుక్కులు చేస్తున్నారు. గత ఏడాది వరి సాగులో నష్టపోయిన రైతులు ఈ సంవత్సరం ఎంతో ఆశ పెట్టుకున్నారు. ఈ సంవత్సరం అయిన ధాన్యానికి ధర బాగుండాలని, దిగుబడులు బాగా రావాలని రైతులు మేలు రకాల విత్తనాలను ఎంచుకుని ఖరీఫ్ పనులు మొదలు పెట్టారు. తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో 55 వేల ఎకరాల్లో వరి సాగును చేయటానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. డివిజనలో ఎక్కువ శాతం మంది రైతులు బీపీటీ 5204 వరివిత్తనాలను ఎంచుకుని సాగు చేస్తున్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు దమ్ము నారుమళ్ళు పోయటంతో పాటు వెద పద్ధతి ద్వారా సాగుకు శ్రీకారం చుట్టారు.

వెద పద్ధతిలో విత్తడం 60 శాతం పూర్తి

డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంలో వ్యవసాయ పనులు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. వాతావరణం అనుకూలించడంతో ఈ సంవత్సరం ఎక్కువశాతం మంది రైతులు వెద పద్ధతి ద్వారా వరిసాగు చేశారు. వర్షాలు తగిన సమయంలో కురియటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాల కారణంగా భూమి పదునుగా ఉండటంతో వెద పద్ధతి ద్వారా వరి సాగు చేయటానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో సుమారు 60శాతం వరకు వెద పద్ధతి ద్వారా వరి విత్తడం పూర్తి అయ్యినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాస రెడ్డి తెలిపారు. మండలంలో 15వేల 500 ఎకరాల్లో వరిసాగు చేయాల్సి ఉండగా అందులో 8వేల ఎకరాల్లో వెద పద్ధతి ద్వారా రైతులు సాగు చేసినట్లు తెలిపారు. ఇంకా 7వేల 500 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉందన్నారు. మరో వారం పది రోజుల్లో వరినాట్లు పూర్తికానున్నట్లు తెలియజేశారు. అధిక దిగుబడులు సాధించేందుకు మండలంలోని రైతులు బీపీటీ సాగుపై మొగ్గు చూపారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు మేరకు రైతులు వరి విత్తనాలను ఎంచుకుని వెద పద్ధతి ద్వారా బీపీటీ విత్తనాన్ని సాగుచేశారు. గత సంవత్సరం వరిలో అధిక దిగుబడులు వచ్చినప్పటికి ధాన్యానికి సరైన ధర లేక పోవటంతో ఎక్కువ మంది రైతులు నష్టపోయారు. ఈ సంవత్సరం అయినా ధాన్యానికి మంచి ధర వస్తుందని ఆశతో రైతులు ఉన్నారు.



దమ్ము నారుమళ్లుపోస్తున్న రైతులు

ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం

● ఎమ్మెల్యే నరేంద్ర కుమార్



వెనిగండ్లలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, జులై 8 (ఆంధ్రజ్యోతి): ఇది ప్రజా ప్రభుత్వం.... ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం అని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. సువరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మంగళవారం మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామ ముస్లిం ఏరియాలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామంలోని ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలను అందజేసి గ్రామంలో వారికున్న సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో తక్షణమే ఆ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే నరేంద్ర ఆదేశించారు. కార్యక్రమంలో పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ తెలుగుదేశం-జనసేన-బీజేపీ పార్టీల రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామం నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

సువరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పెదకాకాని మండలం వెనిగండ్లలోని శ్రీవేమున జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంఎస్ఆర్‌ఐ పథకం కింద రూ.80.70లక్షల నిధులు 4గదుల సైన్స్ ల్యాబ్‌లు, రూ.5లక్షల నిధులతో స్కూల్ గ్రౌండ్ ఓపెనింగ్, మండలం పరిషత్ సాధారణ నిధులు రూ.1.70లక్షలతో బోరింగ్ మోటర్ ఓపెనింగ్ తదితర అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ప్రారంభించారు.

వెనిగండ్ల రేషన్ షాపులో ఎమ్మెల్యే తనిఖీ

మండలంలోని వెనిగండ్లలో ప్రభుత్వ రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆకస్మికంగా తనిఖీచేశారు. గ్రామంలో సువరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఈ రేషన్ షాపును ఆయన తనిఖీచేశారు. అనంతరం షాప్‌లో ఉన్న స్టాకును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణకాంత్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చారు.. స్థలాలు చూపలేదు

● ఎమ్మెల్సీ ఆలపాటికి పలువురి ఫిర్యాదు



వార్డులో ప్రజల యోగక్షేమాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల స్థలాల పేరిట జగనన్న కాలనీల్లో పట్టాలు ఇచ్చి తమ స్థలాలు ఎక్కడున్నాయో చూపలేదని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. సుపరిపాలనలో - తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలోని 16, 17 వార్డుల్లో పర్యటించారు. వార్డు ప్రజల యోగక్షేమాలను సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు జగనన్న కాలనీలో గత ప్రభుత్వంలో స్థలాలు మంజూరు చేసినట్లు పట్టాలు ఇచ్చారని అయితే స్థలాలు ఎక్కడున్నాయో చూపడంలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమకు కేటాయించిన స్థలాలు అందించి ఇల్లు నిర్మించుకునేలా చూడాలని కోరారు. కూటమి ప్రభుత్వ పాలనలో సంతోషంగా ఉన్నామని ఆయా వార్డుల్లో పెద్దఎత్తున మహిళలు ఆలపాటికి తెలిపారు. అనంతరం ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జగనన్న కాలనీల పేరుతో వైసీపీ ప్రభుత్వం భూముల దందాకు తెరలేపిందని విమర్శించారు. సంక్షేమం చేరువచేశామంటూ ప్రజలకు పదేపదే ప్రచారం చేస్తున్న వైసీపీ క్షేత్రస్థాయిలో మాత్రం పట్టాలు ఇచ్చారే తప్ప స్థలాలు లబ్ధిదారులకు అందించలేకపోయారని ఆరోపించారు. పలువురు మహిళలు తమ స్థలాలు ఎక్కడున్నాయో చూపాలని కోరారని దీనిపై విచారణ చేయించి స్థలాలు అందిస్తామన్నారు. వైసీపీ నాయకత్వం కూటమి ప్రభుత్వంపై బురదజల్లేందుకు అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నదని ప్రజలు వాటిని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తొలుత ఆయా వార్డులలో కౌన్సిలర్లు బోయపాటి అరుణ, దివి అనితలతో కలసి టీడీపీ పతాకాన్ని ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎగురవేసి పర్యటనను ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి



మున్నంగిలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్, నాయకులు

తెనాలి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి తెనాలిలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని అమరవీరుల స్తూపాల వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, పలువురు వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొల్లిపరలో...

కొల్లిపర, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతిని మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. వల్లభాపురం, కొల్లిపర, పాతబొమ్మువానిపాలెం, సిరిపురం తదితర గ్రామాల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పరిధిలోని మున్నంగిలో వైసీపీ మండల అధ్యక్షుడు కల్లం వెంకటప్పారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నాయకులతో కలిసి రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. చివలూరులో మాజీ ఎమ్మెల్యే శివకుమార్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్‌లు బొంతు వేణుగోపాల్‌రెడ్డి, వేమూరి దీనమ్మ, పిల్లి రాధిక, జిల్లా పార్టీ కార్యదర్శి శివారెడ్డి, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి, మారీసుపేట: పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని శ్రీ యోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నిర్వహించారు. మంగళవారం స్థానిక మారీసుపేట అమరవీరుల స్తూపాల వద్ద ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని శ్రీయోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కిక్కూరి చిన్న కృష్ణారెడ్డి ట్రస్ట్ సభ్యులతో కలసి నిర్వహించారు. పేదలకు దుప్పట్లు అల్పాహారాన్ని పంపిణీ చేశారు.

● తెనాలి అర్బన్: మారీసుపేటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వైఎస్ఆర్ 76వ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, కర్లపూడి బుల్లియ్య, పెనుగొండ శివకుమార్, స్టీవెన్‌బాబు, సుబ్బారావు, అయ్యప్ప, వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి ఉత్సవాలను మంగళవారం పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. వైసీపీ ఇన్‌చార్జ్ అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహా, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వ్యర్థాలను పూర్తిగా తొలగించండి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్లలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించి డంపింగ్ యార్డుకు తరలించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో అన్నారు. మంగళవారం స్థానిక మారీసుపేట 23వ వార్డులో జరుగుతున్న ప్రత్యే పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రెయిన్లు సైడు కాల్వలలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించి డంపింగ్ యార్డుకు తరలించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించామన్నారు. పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం 24వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎం ఏసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బూత్‌లెవల్ అధికారులకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్, పక్కన తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి, మారీసుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్‌లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం స్థానిక ఐతానగర్‌లోని శ్రీకొత్తమాసు తులసీదాసు కమ్యూనిటీ హాల్‌లో పోలింగ్ స్టేషన్ 53 నుంచి 103 వరకు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు ఎలక్షన్ నిర్వహణ, విధి విధానాలపై ఇన్‌చార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణలు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఎల్వోల పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా 11కేవీ విద్యుత్ తీగలు

● ఒరిగిపోయిన స్తంభం



ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న 11కేవీ విద్యుత్‌లైన్ స్తంభం

తెనాలి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలు ఒక పక్కకు పూర్తిగా ఒరిగిపోయి నేలవాలేలా ప్రమాదకరంగా మారాయి. మండలంలోని నంగం జాగర్లమూడి - శేకూరు రోడ్డులోని సబ్‌స్టేషన్ నుంచి గుంటూరు కార్పొరేషన్ పరిధిలో నిర్వహించే రా వాటర్ పంప్‌హౌస్‌కు విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. ఇది కోనేరు కట్టకు చుట్టూ ఆనుకుని విద్యుత్ స్తంభాల ద్వారా 11కేవీ సరఫరా లైన్ ఉంది. ఈ లైన్‌లో రెండు విద్యుత్ స్తంభాలు నేలవైపు ఒరిగిపోయి లైన్‌వైర్ల సాయంతో నిలిచి ఉన్నాయి. రెండు రోజులుగా వీస్తున్న గాలులకు వైర్లు తెగి స్తంభాలు పడిపోయే పరిస్థితి ఉంది. ఇదేమార్గంగా వ్యవసాయ పనులకు పెద్దఎత్తున రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమై ప్రమాదం జరగకముందే సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

రక్తహీనత నిర్మూనకు కృషి చేయండి

● జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం, బాలచంద్రమౌళి తదితరులు

తెనాలి, మారీసుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రక్తహీనత నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం ఆశా కార్యకర్తలతో అన్నారు. మంగళవారం మారీసుపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడేని పురస్కరించుకొని జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం రక్తహీనతను నిర్మూలించేందుకు ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత ముఖ్యంగా గర్భిణులకు, బాలింతలకు వస్తుందని వారికి ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను నిర్దేశిత మోతాదులలో అందించాలన్నారు. అనంతరం కొత్తపేటలోని రావి సాంబయ్య బాలురోన్నత పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులకు రక్తహీనత, డెంగీ నివారణ మాసోత్సవాల ప్రాముఖ్యతను తెలిపారు. డెంగీ వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ వేముల ప్రియాంక, డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, సూద శివగణేష్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఫైలేరియా ఎస్‌హెచ్‌ఎంవో జి.రవికుమార్, ఫైలేరియా, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఎంపీపీ భీమవరపు పద్మావతి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచికపై మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఎంపీడీవో విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పని చేస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు. ఉత్తమ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



పచ్చిరొట్ట పైర్లను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి తదితరులు

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

● వ్యవసాయశాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి

పొన్నూరు టౌన్, జూలై, 8 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తుల కోసం రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని వ్యవసాయశాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి అన్నారు. మండల పరిధిలోని మునిపల్లెలో మంగళవారం సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ విధానంలో వరి, మాగాణి భూముల్లో 32రకాల పచ్చిరొట్ట పైర్లు సాగుచేస్తున్న పంట పొలాలను రాజకుమారి పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో ఆర్ వెంకటేశ్వరరావు, విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు, కట్టెంపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌలురైతు కార్డులు, పంటలు బీమా గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో చీడపీడల వ్యాప్తిని నివారించవచ్చు: ఏవో

తెనాలిరూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు విత్తనాలు భూమిలో పెట్టేక్రమంలో రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని దీని ద్వారా పంటలకు వ్యాపించే చీడపీడలను తొలిలోనే నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి సుధీర్‌బాబు చెప్పారు. మండలంలోని అంగలకుదురు, కోపల్లె గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో విత్తనశుద్ధిపై సుధీర్‌బాబు ఆధ్వర్యంలో వీఏఏ దీపిక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ వరి విత్తనాలను పొలాల్లో విత్తేముందు వివిధ రకాల తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకునేందుకు విత్తన శుద్ధి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు,సిబ్బంది అభ్యుదయ, ఆదర్శ రైతులు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 688 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.9,000, గరిష్టధర రూ.10,350, మోడల్‌ధర రూ.10,250 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ.9,200, గరిష్టధర రూ.10,291 మోడల్‌ధర రూ.10,250 పలికాయి.

సార్వత్రిక సమ్మె నోటీసులు అందజేత

మంగళగిరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాపి తంగా బుధవారం జరుగనున్న సమ్మెకు సంబంధించి వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో సమ్మె నోటీసులు అందజేశారు. వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని పెదవడ్లపూడి, నూతక్కి గ్రామాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, విద్యాసంస్థలకు వెళ్లి నోటీసులు అందించారు. సార్వత్రిక సమ్మెకు ప్రభుత్వ యంత్రాంగం సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నేతలు జవ్వాది సాంబశివరావు, మొర్ల కోటిలింగం, కోట నంబూద్రిపాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించండి మహాప్రభో..

పెదనందిపాడు, జూలై, 8(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వరగాని గ్రామానికి చెందిన దివ్యాంగుడు చింతకాయల గోపీనాథ్ తనకు పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వద్ద వేడుకున్నారు. మూడు సంవత్సరాల క్రితం పక్షవాతం వచ్చిందని దీంతో ఏపని చేయలేకున్నానని, తనకు ఇద్దరు పిల్లలు, భార్య ఉండని కుటుంబ పోషణ భారంగా మారిందని దివ్యాంగ పింఛను ఇప్పించి ఆదుకోవాలని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు.

విత్తన శుద్ధికి జీవామృతం కీలకం

• ఏవో చందోలు సునీత

వట్టిచెరుకూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సాగుకు నిర్దేశించిన విత్తనాలను ప్రథమ దశలో విత్తనశుద్ధికి జీవామృతం శ్రేయస్కరంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి చందోలు సునీత రైతులకు సూచించారు. వట్టిచెరుకూరు, కొరెంపూడిపాడు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏవో సునీత పాల్గొని రైతులకు విత్తన శుద్ధితో గల ప్రయోజనాలు, కౌలు రైతు కార్డులు, పండించే పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవటం ద్వారా వచ్చే ఫలితాలను రైతులకు వివరించారు. అలాగే ప్రస్తుతం వరిసాగుకు రైతులు సిద్ధమవుతున్న నేపథ్యంలో వరి విత్తనాలను జీవామృతంతో విత్తనశుద్ధిని చేసుకొనే విధానాన్ని క్షేత్ర స్థాయిలో వీఏఏల ద్వారా చేసి చూపించారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర అందేలా చూడాలి

• పాశం రామారావు

పెదనందిపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): నాగులపాడు ఉపమార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర అందేలా చూడాలని రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో మంగళవారం రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే రైతుల వద్ద 30వేల టన్నుల పొగాకు పంట ఉందని కానీ ప్రభుత్వం 2008 టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని, దీనికి తోడు గ్రేడ్లు నిర్ణయించి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ఉపమార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై ఎమ్మెల్యే రామాంజనేయులు హామీ ఇచ్చారని, ఇంతవరకు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ఎమ్మెల్యేపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, చంద్రరావు, వెంకటశివరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి మంత్రి లోకేశ్ అండ

మంగళగిరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన ఓ వ్యక్తికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. మంగళగిరి టిడ్కో సముదాయానికి చెందిన వామనపల్లి యోగానంద్ గతంలో స్వర్ణకార వృత్తి చేసేవాడు. పనులు లేకపోవడంతో ర్యాపిడోలో సంస్థలో బైకు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల విజయవాడలో బైకు నడుపుతుండగా ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యులు నాలుగు నెలలపాటు పూర్తి విశ్రాంతి అవసరమని చెప్పడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్ తక్షణమే స్పందించి స్థానిక నేతల ద్వారా మంగళవారం రూ.15 వేల ఆర్థికసాయాన్ని అందజేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు వాసా పద్మావతి, అబ్దుల్ మజీద్, బూదాటి శ్రీనివాసరావు, అన్నం ఆదినారాయణ, కొల్లి శ్రీనివాసరావు, జంజనం సాంబశివరావు, ఆయూబ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు కాంగ్రెస్ నేతల నివాళి

మంగళగిరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళగిరి కాంగ్రెస్ కార్యాలయంలో నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బస్టాండు వద్ద గల వైఎస్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కంతేటి జీవన్‌సాగర్, నేతలు కుర్రా పున్నారావు, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ను మరిచిన వైసీపీ

పెదనందిపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రధాన పునాది వైఎస్సార్ మాత్రమే అలాంటి వైఎస్సార్‌ను వైసీపీ శ్రేణులు పూర్తిగా విస్మరించారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ జయంతి వేడుకలు మంగళవారం జరిగిన ప్పటికీ అన్నవరంలో మాత్రం వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించేవారే కరువయ్యారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ఎజెండా

• ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ • వెంకటపాలెంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'



వెంకటపాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తుళ్లూరు(వెంకటపాలెం), జూలై 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ఎజెండా కూటమి పని చేస్తుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని వెంకటపాలెంలో కూటమి నాయకులు కార్యకర్తలతో కలసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. తొలుత సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఎమ్మెల్యే నివాళి అర్పించారు. తరువాత గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే చెప్పాలని అడిగారు. కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందనే కారణంతో ఉచిత గ్యాస్ బండ పథకం అమలు కావటం లేదని ఫిర్యాదు చేశారు. త్వరగా ప్లాట్లు అభివృద్ధి చేసి అందించాలని ఎమ్మెల్యేను రైతులు కోరారు. సీఆర్డీఏ సమస్యలున్నాయని తెలిపారు. కూటమి పాలనలో ప్రశాంతంగా జీవిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సంక్షేమం అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు అని చెప్పారు. కూటమి వచ్చిన తరువాత పరిపాలన గాడిలో పడిందన్నారు. గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా రూ.866 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో రోడ్లను అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్రంలో అరాచక శక్తులకు అడ్డుకట్ట వేశామన్నారు. ఒక సంవత్సరంలో చేసిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను ఇంటింటికి అందజేశారు. డోర్ నెంబరు ఆధారంగా సందర్శించి వారు చెప్పిన సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు, వెంకటపాలెం గ్రామ అధ్యక్షుడు జమ్ముల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీలు బెల్లంకొండ నరసింహారావు, పత్రిపాటి నాగమల్లేశ్వరావు, మాజీ సర్పంచ్ చేకూరి రవి, యూనిట్ ఇన్‌చార్జ్ వీరయ్య యువత నాయకులు చంటి, బుజ్జి, ఉగ్గం శ్రీనివాసరావు, దామినేని శ్రీనివాసరావు, పుట్టి రామచంద్రరావు, వేజళ్ల శివప్రసాద్, నాయకులు ఉప్పలపాటి సాంబశివరావు, కాటా అప్పారావు మైనేని గిరిజా తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనతో రోడ్డు సమస్యకు చెక్

తుళ్లూరులో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డులో మురుగునీరు నిలబడి ప్రజలు ఎన్నో సంవత్సరాల నుంచి ఇబ్బందిపడుతున్నారు. చిన్న వర్షం పడినా నీరు నిలిచి మురుగులో నుంచి వెళ్లే పరిస్థితి ఉంది. ఆ సమస్యకు చెక్ పెడుతూ రూ.35 లక్షలతో సిమెంటు రోడ్డు వేయటానికి ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మంగళవారం శంకుస్థాపన చేశారు.

మహిళలపై వైసీపీ నేతల వ్యాఖ్యలు సిగ్గుచేటు

• ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ



25వ వార్డులో కరపత్రాలను పంచుతున్న ఎమ్మెల్సీ అనురాధ, టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు ఉచ్చనీచాలు మరిచి మహిళలపై చేస్తున్న వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉంటున్నాయని ఎమ్మెల్సీ, శాసన మండలి చీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె పట్టణంలోని 25వ వార్డులో స్థానిక టీడీపీ నేతలతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో కూటమి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ కొవ్వూరులో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చేస్తున్న అభివృద్ధి చూచి ఓర్వలేకనే వైసీపీ నేత ప్రసన్నకుమార్ రెడ్డి నోటికొచ్చినట్టు వాగుతున్నాడని ధ్వజమెత్తారు. ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలు వారి ఇంట్లో వాళ్లు సైతం సిగ్గుపడేలా ఉన్నాయన్నారు. వైసీపీ లాంటి మురికి పార్టీ నుంచి అంబటి, అనిల్ కుమార్ యాదవ్, కారుమూరి నాగేశ్వరరావు, నందిగం సురేశ్, గోరంట్ల మాధవ్, ప్రసన్నకుమార్ రెడ్డి వంటి చీడపురుగులను జగన్ సమాజం మీదకు వదులుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టానుసారం మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పోతినేని శ్రీనివాసరావు, గుత్తికొండ ధనుంజయరావు, కాండ్రు శ్రీనివాసరావు, పడవల మహేష్ వాకా మాధవరావు, ఊట్ల దుర్గామల్లేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

మీరెందుకిలా తిప్పుకుంటున్నారు?

• తహసీల్దార్ సిబ్బందిపై సర్పంచ్ ఆగ్రహం



జూనియర్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తిక్కిరెడ్డిపాలెం సర్పంచ్ జగన్

ప్రత్తిపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి చిన్న పనికి మీరెందుకు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు? అంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన తిక్కిరెడ్డిపాలెం సర్పంచ్ మాకినేని జగన్ తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తిక్కిరెడ్డిపాలెంనకు చెందిన తులసి కృష్ణారావు కుటుంబానికి తల్లికి వందనం సొమ్ము రాకపోవడంతో అర్జీ పెట్టుకున్నారు. ఆ ఫైల్‌ను క్లియర్ చేయడకుండా జూనియర్ అసిస్టెంట్ దానిని తన టేబుల్ వద్దనే ఉంచుకుంది. ఈ విషయంపై సర్పంచ్ మాకినేని జగన్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా ఆ సమయంలో జూనియర్ అసిస్టెంట్ లేకపోవడంతో అక్కడే ఉన్న సీనియర్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. అంతలో అక్కడికి వచ్చిన జూనియర్ అసిస్టెంట్ సైతం సరిగా సమాధానం చెప్పకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంపై ఇప్పటికే ఎమ్మెల్యేకు ఫిర్యాదులు వెళ్లాయన్నారు. దీనిపై వెంటనే ఫైల్ క్లియర్ చేసి పంపుతానంటూ జూనియర్ అసిస్టెంట్ సమాధానం చెప్పడంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పంచాయతీల పురోగతికి 2.0 కీలకం

ప్రత్తిపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరోగతికి 2.0 వెర్షన్ ఎంతో కీలకం అవుతుందని ఎంపీడీవో శివపార్వతి తెలిపారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో 2023 -24 సంవత్సరానికి సంబంధించి పంచాయతీ పురోగతి సూచిక 2.0 పై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పంచాయతీ పురోగతిపై స్కోర్ ఆధారంగా పంచాయతీలకు జాతీయ స్థాయిలో అవార్డులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే పంచాయతీల పురోగతికి తీసుకోవలసిన పలు విషయాల గురించి ఆమె వివరించారు. తొలుత గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాలకు చెందిన పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గృహాలకు క్లోరినేషన్ నీటిని విడుదల చేయాలి

• జడ్పీ సీఈవో జ్యోతిబసు



పొట్లపాడులో చెత్త సేకరిస్తున్న వారితో జడ్పీ సీఈవో జ్యోతిబసు

మేడికొండూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీటిని సరఫరా చేసే సమయంలో తప్పనిసరిగా క్లోరినేషన్ చేసి గృహాలకు నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేయాలని జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు అధికారులకు సూచించారు. మండలంలోని జంగంగుంట్ల పాలెం, పొట్లపాడు గ్రామాలను సీఈవో మంగళవారం సందర్శించారు. జంగంగుంట్ల పాలెం, పొట్లపాడు గ్రామాల్లో గృహ యజమానుల నుంచి చెత్త సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. జంగంగుంట్లపాలెంలో మంచి నీటి సరఫరా స్కీం పరిశీలించి ప్రతి రోజు గ్రామంలోకి క్లోరినేషన్ చేసిన నీటి సరఫరా చేయవలసిందిగా సిబ్బందిని ఆదేశించారు. పొట్లపాడు గ్రామం సందర్శించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం గ్రామానికి దూరంగా ఉన్నందున కేంద్రం వద్దకు ఉన్న మట్టి రోడ్డు అనువుగా లేకపోవడంతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఆర్సీ సిబ్బంది నిరంజన్‌రావు, క్యాంప్ క్లర్కు అహ్మద్, ఎంపీడీవో ప్రభాకర్‌రావు, పంచాయతీరాజ్ ఏఈ అజయ్‌కుమార్, నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజనీర్ సుజాతతో పాటు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తున్న సీఎం చంద్రబాబు

ప్రత్తిపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న సీఎం చంద్రబాబునాయుడు అని టీడీపీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్ అన్నారు. మండలపరిధిలోని నిమ్మగడ్డవారిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రత్తిపాడు మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఇనగంటి సుధాకర్, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

• ఎంపీడీవో లక్ష్మీదేవి

పెదనందిపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల పురోగతికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల పురోగతిని అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌గా గుర్తించామన్నారు. ప్రధానంగా సుస్థిరాభివృద్ధి గ్రామంలో ప్రజాసమస్యల గుర్తింపు పరిష్కారం వంటి అంశాలపై కేటాయించిన పాయింట్ల ఆధారంగా పంచాయతీల పురోగతిని గుర్తించనున్నట్లు తెలిపారు. సూచిక తయారీపై శిక్షణ నిచ్చారు. పురోగతి సాధించిన పంచాయతీలను ఉత్తమ గ్రామ పంచాయతీలుగా గుర్తించి కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అవార్డులు ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఏఐ డీప్ లెర్నింగ్‌పై అవగాహన సదస్సు




ప్రసంగిస్తున్న డీన్ శ్రీనాథ్

తాడేపల్లి (వడ్డేశ్వరం), జూలై 8 (ఆంధ్ర జ్యోతి): నైపుణ్యాభివృద్ధి ఆవిష్కరణలలో భారతదేశంలోని ప్రముఖ సంస్థల్లో ఒకటైన కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో జనరేటివ్ ఏఐ డీప్ లెర్నింగ్ అనే అంశంపై నాలుగు రోజుల అవగాహన సదస్సును మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారతదేశంలోని ప్రముఖ సాంకేతిక సంస్థల్లో ఒకటైన ఇన్ఫోసిస్ సహకారంతో నిర్వహించబడుతుందని కేఎల్‌యూ స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ ఏ శ్రీనాథ్ తెలిపారు. ఈ నెల 11వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇన్ఫోసిస్ నుంచి నిపుణులైన సాంకేతిక నిపుణులు అమల్‌సలీలన్, ఎంకే అబీద్ శిక్షణ తరగతులకు నాయకత్వం వహిస్తున్నారని చెప్పారు. వర్క్‌షాప రెండు అధిక ప్రభావ ప్రాంతాలను కవర్ చేస్తుందన్నారు. ఒకటి జనరేటివ్ ఏఐ విద్యారంగం, పరిశ్రమలో ప్రాథమిక అంశాలు, సాధనాలు, నైతిక చిక్కులు, అనువర్తనాలను కవర్ చేస్తుందన్నారు. రెండోది డీప్ లెర్నింగ్, న్యూరో నెట్‌వర్క్‌లు, ఆర్కిటెక్చర్లు రియల్ టైం డిప్లాయ్‌మెంట్ యూజ్ కేసులపై దృష్టి సారించడమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వీసీ సారధివర్మ, శ్రీనాథ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు ఆచార్యులు, అతిథులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

పెదనందిపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలని ఎంఈవో ముద్దన శ్రీనివాసరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పరికరాలను మంగళవారం వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని, ఫిజియోథెరపి చేసేందుకు వ్యాయామ వైద్యులు కూడా అందుబాటులో ఉన్నారని, క్రమం తప్పకుండా వ్యాయామం చేపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ ఎస్ బాలబ్రహ్మచారి, ఉపాధ్యాయులు ఎస్ పరిమళ, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

మంగళగిరి సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ రఘువీర్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం మంగళగిరి తాలూకా సెంటరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. రఘువీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. వంద రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక తూతూ మంత్రంగా కేవలం రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేశారని విమర్శించారు. బడ్జెట్ సమావేశాల నాటికి రాష్ట్రంలో రూ.3,900 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, ఆ సమావేశాల్లో ప్రభుత్వం రూ.2,600 కోట్లు కేటాయించగా.. కనీసం ఒక్క విద్యార్థికి కూడా నేటి వరకు లబ్ధి చేకూరలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11వ తేదీన అన్ని కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి మంచికలపూడి గోపి, జిల్లా సహాయ కార్యదర్శి అమర్‌నాథ్, సామియేల్, జ్యోతిక, లావణ్య, అఖిల, పద్మ పాల్గొన్నారు.

సబ్సిడీపై అందించే పండ్లమొక్కలను వినియోగించుకోండి

దుగ్గిరాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై అందించే పండ్ల మొక్కలను రైతులు సద్వినియోగించుకోవాలని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. సబ్సిడీపై అందించస్తున్న మొక్కలు నాటే కార్యక్రమం ఎంపీపీ జబీన్ మంగళవారం ప్రారంభించారు. చింతలపూడి గ్రామంలోని రైతు పేరం భాస్కరరావు పొలంలో నిమ్మమొక్కలు నాటిన జబీన్ మాట్లాడుతూ, రైతులు పండించే వరి, మొక్కజొన్న తదితర పంటలకు తోడు అదనపు ఆదాయం కోసం మెట్టపంటలు వేస్తుంటారని, నిమ్మ, మామిడి, తదితర పండ్ల తోటల సాగుద్వారా అదనపు ఆదాయం పొందవచ్చునన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో కంటే మెరుగైన ఆదాయం సాధించేందుకు పండ్లతోటలను పెంచే రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. మండలంలోని 18గ్రామాలకు గానూ ఎనిమిది గ్రామాల్లో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. సర్పంచ్ తాడిబోయిన రామకృష్ణ, ఏపీఎం మధుబాల, కార్యదర్శి మణికంఠ, రైతులు ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

• కాకుమాను, జూలై 8(ఆంధ్రజ్యోతి): రైతులు పండ్ల తోటల సాగు చేసి పంట ఉత్పత్తులను సకాలంలో విక్రయించుకుంటే అధిక ఆదాయం పొందవచ్చని అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి శ్యామలాదేవి అన్నారు. కాకుమానులో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకం కార్యక్రమం రైతు వంగలూరు రామకృష్ణ వ్యవసాయక్షేత్రంలో నిర్వహించారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

తాడేపల్లి (వడ్డేశ్వరం), జూలై 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు న్యాయబద్ధంగా జీవో నెం.36 ప్రకారం జీతాలు పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఉన్న ప్రజాసంఘాల కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మేకల డేవిడ్ అధ్యక్షత వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మికులను కట్టుబానిసలుగా చేస్తుందని విమర్శించారు. మున్సిపల్ మంత్రి నారాయణతో అనేక దఫాలుగా సమస్య పరిష్కరించాలని విన్నవించినా పరిష్కారం కాలేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే జులై 12 అర్ధరాత్రి నుండి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతారని హెచ్చరించారు.



పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

రైతుల సంక్షేమం కోసం కూటమి విశేష కృషి

• ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు
• పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

కాకుమాను, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం రాజీ లేకుండా విశేష కృషి చేస్తుందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. కాకుమానులో మంగళవారం కూటమి నాయకులతో కలసి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ రైతుల వ్యయ ప్రయాసలకు ఓర్చి పంటల సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్య పడొద్దని తెలిపారు. రంగు మారిన, అడుగాకును కూడా కొనుగోలు చేస్తామన్నారు. పెదనందిపాడు మండలంలో విరివిగా పొగాకు సాగు జరిగిందని ఆ మండలంలో పొగాకు ఇక్కడకు తరలిస్తే ఇక్కడ రైతులకు సమస్యలు వస్తాయని కొండపాటూరుకు చెందిన రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే పెదనందిపాడులో కూడా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మార్క్‌ఫెడ్ అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా విక్రయాలు చేయాలని ఆదేశించారు. రైతులకు పొగాకు కొనుగోలు కేంద్రాల నుంచి ఇబ్బందులు వస్తే నేరుగా తనని సంప్రదించవచ్చని వెల్లడించారు. ప్రతిపక్ష పార్టీలు చేసే అసత్య ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని అన్నారు. కార్యక్రమంలో జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి కొర్రపాటి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరత్తయ్య, టీడీపీ నాయకులు కుర్రి సుబ్బారెడ్డి, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ సువ్వల సునీల్‌చౌదరి, కొల్లా వీరయ్య చౌదరి, గింజుపల్లి వెంకటేశ్వరరావు, మామిళ్లపల్లి రాంగోపాల్, నల్లమోతు పూర్ణచంద్రరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు సర్వనాశనం

• డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు

తాడికొండ(మోతడక), జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలను వినియోగించి జీవితాలు సర్వనాశనం చేసుకోకూడదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మోతడకలోని చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అధికారులు మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ గంజాయి, మద్యపానం, డ్రగ్స్, ధూమపానం వల్ల ఆరోగ్యాలతో పాటు జీవితాలు నాశనం అవుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం రవికుమార్ రెడ్డి, చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాసరావు, మంగళగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐలు రవికుమార్, పద్మజ పాల్గొన్నారు.

ఫిరంగిపురం జిల్లాలో మొదటి స్థానం పొందాలి

• జిల్లా డ్వామా పీడీ శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వి శంకర్

ఫిరంగిపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం మండలాన్ని సర్వే, ప్రణాళికలు వాటి ఆచరణలో గుంటూరు జిల్లాలో ప్రథమ స్థానం పొందేలా అధికారులు కృషి చేయాలని జిల్లా డ్వామా పీడీ వి శంకర్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ మీటింగ్ హాల్లో జరిగిన పంచాయతీ పురోగతి సూచిక శిక్షణ శిబిరంలో జ్యోతి ప్రజ్వలన చేసిన ఆయన మాట్లాడారు. దేశ ఆర్థికాభివృద్ధి, మానవ అభివృద్ధి సూచిక ద్వారా తెలుస్తుందన్నారు. కనుకనే గ్రామ, మండల స్థాయిలో 147 నిబంధనలను అనుసరించి ప్రతి వ్యక్తిని కలసి సర్వే చేసి ప్రణాళికను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీ శివసుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఈవో ఏ కిషోర్‌బాబు, గ్రామ కార్యదర్శులు, వైద్యాధికారులు, సచివాలయ అధికారులు, ఏపీవో కిరణ్మయి, ఏపీఎం నాగేశ్వరరావు, ఐసీడీఎస్ అధికారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఏడు పీఏసీఎస్‌లకు నామినేటెడ్ సభ్యుల నియామకం

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు నామినేటెడ్ చైర్‌పర్సన్, ఇద్దరు సభ్యుల చొప్పున నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అబ్బినేనిగుంటపాలెం పీఏసీఎస్‌కు చైర్‌పర్సన్‌గా ఎస్ పార్వతి, సభ్యులుగా కట్టా రాజు, షేక్ సాంబయ్య, కారంపూడిపాడు చైర్‌పర్సన్‌గా తోట అయ్యప్ప, సభ్యులుగా గేరా సుజాత, తుమ్మల రత్తయ్య, లేమల్లెపాడు చైర్‌పర్సన్‌గా పాతూరి కృష్ణారావు, సభ్యులుగా గంగసాని తిరుపతయ్య, కాకుమాను నిర్మల, వట్టిచెరుకూరు చైర్‌పర్సన్‌గా చిరుమామిళ్ల నరసింహారావు, సభ్యులుగా దూపాటి వీరయ్య, యంత్రపాడి సముద్రాలు నియమితులయ్యారు. గోరంట్ల చైర్‌పర్సన్‌గా ఘంటసాల సోమశేఖర్, సభ్యులుగా ఇమ్మడి అంకమ్మరావు, నల్లపనేని నాగశ్రీ, తురకపాలెం చైర్‌పర్సన్‌గా తోట శంకర్, సభ్యులుగా గుంటూరు ప్రఖ్యాత్, గుమ్మా శ్రీసుధేష్ణ దేవి, బుడంపాడు చైర్‌పర్సన్‌గా మన్నెం శ్రీమన్నారాయణ, సభ్యులుగా ఓగిబోయిన వెంకటేశ్వరమ్మ, ఏటుకూరి బాలశౌరి నియమితులయ్యారు.

శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎమ్మెల్యే బూర్ల

పెదనందిపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): పుసులూరులో ఇటీవల హత్యకు గురైన గొర్రెల కాపరి తలవల శ్రీనివాసరావు కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే రామాంజనేయులు హామీ ఇచ్చారు. మండలపరిధిలోని పుసులూరులో మంగళవారం శ్రీనివాసరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మనిషిని హత్య చేయడమే కాకుండా తమ కుటుంబానికి జీవనోపాధి అయినటువంటి గొర్రెలను కూడా దుండగులు అపహరించుకెళ్లారని కుటుంబసభ్యులు తెలిపారు. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ చేస్తున్నట్లు, త్వరలో దుండగులను అరెస్టు చేయడంతో పాటు కఠినంగా శిక్షించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే వారి పిల్లలను హాస్టల్‌లో చేర్పించినట్లు, బ్యాంకులో ఉన్న బంగారు నగలు ఇప్పిస్తామని, వితంతు పింఛనుతో పాటు ఉద్యోగం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కుటుంబ ఖర్చుల నిమిత్తం రు.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

మేం మనుషులం కాదా.. మా సమస్యలు పరిష్కరించరా..

• పంచాయతీ కార్యదర్శిపై మండిపడ్డ ఎస్సీ కాలనీవాసులు

పెదనందిపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులపాడు ఎస్సీ కాలనీలో సమస్యలు ఎందుకు పరిష్కరించడంలేదంటూ పంచాయతీ కార్యదర్శి శ్వేతపై కాలనీవాసులు మండిపడ్డారు. తడి పొడి చెత్తల సేకరణలో భాగంగా ఆ ప్రాంతానికి వెళ్లిన కార్యదర్శితో కాలనీ వాసులు మేము మనుషలం కాదా.. మా సమస్యలు పట్టవా కాలనీలో కనీసం వీధి దీపాలు కూడా వెలగడం లేదని, మురుగు కాలువల్లో పూడిక తీయరని, తాగునీరు కూడా సకాలంలో అందడం లేదని వాపోయారు. పన్నులు చెల్లించకుంటే పింఛన్లు ఇవ్వమంటూ, ఇచ్చే పింఛన్లలోనే నగదు జమచేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. గృహావసరాలకు కూడా నీరు లేకపోవడంతో తమ పిల్లలతోనే నీరు తెప్పించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమ బాటపడతామని హెచ్చరించారు.